ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శుక్రవారం 18 జూలై 2025



వెక్కిరిస్తున్న జల్ జీవన్..!

పైపులకే పరిమితమైన జల్‌జీవన్ మిషన్
నివాసాలు లేని ప్రాంతాల్లో పైపు లైన్ల ఏర్పాటు
పలు చోట్ల నీరు రాక ఇబ్బంది పడుతున్న ప్రజలు



నిరుపయోగంగా ఉన్న పైపులైన్

నల్లమాడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చి, తాగు నీరు సరఫరా చేసేందుకు ప్రారంభించిన జల్‌జీవన్ మిషన్ మండలంలో సక్రమంగా అమలు కావడం లేదు. ఈ పథకం అమలు కోసం మండలంలోని వివిధ పంచాయతీలకు రూ. రెండు కోట్ల నిధులు మంజూరు చేశారు. చాలా గ్రామాల్లో పైపులైన్లు వేసి, అరకొరగా కొళాయిలు ఏర్పాటు చేశారు. వాటికి కూడా నీటి సరఫరా జరగడం లేదని గ్రామీణ ప్రజలు పేర్కొంటున్నారు. దీంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన పైపులైన్లు వృథాగా మారాయి.

పైపులైన్లలో ప్రవహించని నీరు

మండలంలో నల్లమాడ, కురమాల, పులగంపల్లి, రెడ్డిపల్లి, పాతబత్తలపల్లి, వంకరకుంట, చారుపల్లి, ఎర్రవంకపల్లి, వేళ్లమద్ది, పెమనకుంటపల్లితండా, కొండకిందతండా తదితర పంచాయతీల్లో జల్ జీవన్ మిషన్ పనులు చేశారు. నల్లమాడ, పులగంపల్లి పంచాయతీల్లో పనులు పూర్తి కాలేదు. ఈపనులన్నీ గత ప్రభుత్వంలో చేపట్టారు. అధిక గ్రామాల్లో ఒకటి రెండు ఇళ్లు ఉన్న చోట పథకానికి సంబంధించిన పైపులైన్లు ఏర్పాటు చేశారు. జనాభా అధికంగా ఉన్న ప్రాంతాలను మాత్రం మరిచారు. దీంతో తమకు తాగు నీరు సరఫరా కావడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతు న్నారు. పులగంపల్లి సమీపంలోని ప్రధాన రహదారికి పక్కనే ఖాళీ స్థలంలో పైపులైన్లు వేసి వదిలేశారు. గతంలోనే ఈ స్థలంలో ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ప్రస్తుతం ఇక్కడ ఐదారు ఇండ్లు నిర్మించారే గానీ నివాసం మాత్రం ఎవరూ ఉండటం లేదు. దీంతో ఎవరి కోసం ఇక్కడ కొళాయిలు అమర్చుకోవడానికి పైపులు పెట్టారనే విమర్శలు తలెత్తుతున్నాయి. నల్లమాడ హమాలీ కాలనీలో పైపులైన్లు ఉన్నా, వాటికి నీటి సరఫరా చేయడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లమాడ క్రాస్ నుంచి ఆర్టీటీ కార్యాలయం వరకు పైపు లైన్ ఏర్పాటు చేశారు. ఇందులో ఏరోజు నీరు వచ్చిన దాఖలాలు లేవని, కొళాయిలు మాత్రం దర్శనమిస్తున్నాయని ప్రజలు పేర్కొంటు న్నారు. వైఎస్ఆర్ సర్కిల్‌లోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక భాగంలో పైపులైన్లు ఏర్పాటు చేశారు కానీ నీరు వదలడం లేదు. నల్లమాడ బీసీ హాస్టల్ సమీపంలోని మేదారకాలనీ, అక్కమ్మగారివీధి, 30పడకల ఆసుపత్రి సమీపంలో కూడా పైపులైన్ ఉంది కానీ నీళ్లు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా చాల గ్రామాల్లో జల్‌జీవన్ మిషన్ పథకం కిందవేసిన పైపులైన్లలో నీరు సరఫరా కాలేదని, పంచాయతీల పాత పైపులైన్ల ద్వారానే నీరు సరఫరా అవుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. మండల వ్యాప్తంగా చేసిన పనులకు దాదాపు 70శాతం బిల్లులు మంజూరైనట్లు అధికారులంటున్నారు. కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించకపోవడంతో మంజూరైన నిధులు వెనక్కు వెళ్లినట్లు సమాచారం.

అన్ని గ్రామాల్లో నీటిని అందిస్తున్నాం

మండలంలో చాల పంచాయతీల్లో జల్‌జీవన్ మిషన్ పైపులైన్లద్వారానే నీటిని సరఫరా చేస్తున్నాం. ఈ పథకం కింద నిరుపయోగమైన ప్రాంతాల్లో పైపులైన్లు వేసిన వాటికి బిల్లులు మంజూరు చేయలేదు.

- శశికళ, జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్

సస్పెన్షన్‌పై కుతకుత..!

పార్టీ కోసం కష్టపడినందుకు బహుమతా..?

- నవీన్ నిశ్చల్, కొండూరు వర్గాల మండిపాటు
- వైఎస్సార్ సన్నిహితులపై వేటు పట్ల అభ్యంతరం
- తాజా చర్యలతో పురంలో వైసీపీ మరింత బలహీనం

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైఎస్ కుటుంబాన్ని దశాబ్దాలుగా అంటిపెట్టుకున్న ఇద్దరు ముఖ్య నేతలపై వైసీపీ వేటువేసింది. ఒకే సమయంలో ఇద్దరు ముఖ్య నాయకులను సస్పెండ్ చేయడం హిందూపురం రాజకీయాల్లో కలకలం రేపింది. ఇన్నేళ్లుగా ఆ కుటుంబం కోసం ఎన్నో కేసులు మోసిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ చర్య మింగుడుపడటం లేదు. వైసీపీ పురం నియోజకవర్గ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వైఎస్సార్ హయాంలో నుంచి కాంగ్రెస్‌లో, ఆ తరువాత వైసీపీలో ఉన్నారు. నవీన్ నిశ్చల్ సైతం వైఎస్సార్ కుటుంబ సన్నిహితుడే. పార్టీ మాట ఎట్లున్నా, సొంతంగా బలం పెంచుకున్న నాయకుడు. అలాంటి ఇద్దరిపై కఠిన చర్యలను ఊహించలేదని స్థానిక నాయకులు, కార్యకర్తలు అంటున్నారు. రాజకీయాల్లో మూడు దశాబ్దాలుగా కీలకంగా ఉన్న ఆ ఇద్దరితోపాటు దళిత సామాజికవర్గానికి చెందిన పార్టీ బి-బ్లాక్ అధ్యక్షుడు సీఎన్‌పీ నాగరాజు, ఆయన భార్య, కౌన్సిలర్ చిన్నమ్మ, మైనార్టీ సామాజికవర్గానికి చెందిన కౌన్సిలర్ మజీన, హబీబ్‌ను కూడా వైసీపీ నుంచి సస్పెండ్ చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నవీన్ నిశ్చల్

సొంత బలం ఉన్నవారే..

హిందూపురం నియోజకవర్గంలో నవీన్ నిశ్చల్ రాజకీయాలకు అతీతంగా సొంత బలాన్ని పెంచుకున్నారు. ఎంతగా అంటే.. 2009 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి.. కాంగ్రెస్ అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు సాధించారు. ఆ ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచారు. నియోజకవర్గంలో మాస్ లీడర్‌గా గుర్తింపు పొందారు. మైనార్టీలు, బీసీలు, దళితులలు ఎన్నికల్లో (మిగతా 6లో..)

నా పోరాటాలకు ఇది గిఫ్ట్
- నవీన్ నిశ్చల్ ఆవేదన 6

ప్రజల్లో సంతృప్తస్థాయి పెంచాలి
- కలెక్టర్ టీఎస్ చేతన్



మాట్లాడుతున్న కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తస్థాయిని పెంచేందుకు అధికారులు కృషిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్ అధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్.. నియోజకవర్గాల వారీగా ఎంఎస్ఎంఈ పార్కుల స్థల పరిశీలన ప్రారంభోత్సవాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. పి4 పథకం గురించి గ్రామసభలు నిర్వహించి, బంగారు కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, ఆర్డీఓలు సువర్ణ, మహేష్, ఆనంద్‌కుమార్, వీవీఎస్ శర్మ, సీపీఓ విజయ్‌కుమార్, పరిశ్రమ శాఖాధికారి నాగరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ రెడ్డి, డీఎస్‌డీఓ వంశీకృష్ణారెడ్డి, గనుల శాఖ డీడీ పెద్దిరెడ్డి పాల్గొన్నారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు నిధుల వరద
- బడ్జెట్‌లో కేటాయింపుల వివరాలు విడుదల 7

నామినేటెడ్ సంబరం
ఆరు మార్కెట్ యార్డు కమిటీలకు చైర్మన్ల నియామకం 7

యువతికి వేధింపులు.. కేసు నమోదు 7

బడుల్లో వింత..!



శిథిలావస్థకు చేరుకున్న రాజమోళ్లపల్లితండా పాఠశాల

విద్యార్థులు ఉన్నచోట సౌకర్యాలు లేవు
వసతులున్న చోట విద్యార్థులు కరువు
ఏటా తగ్గుతున్న అడ్మిషన్‌ల సంఖ్య

నల్లచెరువు, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో జరుగుతున్న వింతలు చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అన్ని వసతులు ఉన్న పాఠశాలల్లో పిల్లలు లేరు. విద్యార్థుల సంఖ్య ఉన్న చోట కనీస సౌకర్యాలు లేవు. నల్లచెరువు మండలంలో 53 పాఠశాలలు ఉన్నాయి. 2,187 మంది విద్యార్థులు చదువుతున్నారు. పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు ఉన్నా వసతులు సరిగా లేవు. మరికొన్ని గ్రామాల్లో వసతులున్నా విద్యార్థులు కరువయ్యారు. పెద్దయల్లంపల్లి, దేవిరెడ్డిపల్లి, తిరుమల దేవరచెరువు, తెల్లగుట్లపల్లి, గోరంట్లవారిపల్లిలోని పాఠశాలలో ఒక్క విద్యార్థి లేని పరిస్థితి. ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గుతూనే వస్తోంది. గత ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2,449 మంది విద్యార్థులు ఉండగా.. ఈ యేడాది 2,187 మంది ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. రాట్నాలపల్లిలో అన్ని వసతులతో కలిగిన పాఠశాల ఉన్నా.. అక్కడ 8 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నారు. గత సంవత్సరం 1 నుంచి 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలలో 59 మంది పిల్లలు ఉండేవారు. ప్రస్తుతం ప్రైమరీ పాఠశాలగా మార్చడంతో 8 మందికి పరిమితమయ్యారు. 2021-22లో ఇదే పాఠశాలలో 120 మంది విద్యార్థులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. రాజమోళ్లపల్లితండాలో ప్రస్తుతం 15 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల భవనం శిథిలావస్థలో ఉంది. ఆ గ్రామం నుంచి సుమారు 20 మంది విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రైవేటు పాఠశాలకు వెళుతున్నారు. అన్ని వసతులు కల్పిస్తే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపడానికి సిద్ధంగా ఉన్నామని తండా వాసులు అంటున్నారు. పాఠశాలలో కనీసం తాగునీరు, మరుగుదొడ్లు కూడా లేవని చెబుతున్నారు.



అన్ని వసతులు ఉన్న రాట్నాలపల్లి ప్రభుత్వ పాఠశాల



ఉబిచెర్ల పాఠశాల గదిలో నిర్వహిస్తున్న హెల్త్ సెంటర్

పాఠశాల గదిలోనే ఆసుపత్రి

ఉబిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 55 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు నిర్మాణ దశలోనే ఆగిపోయాయి. తాగునీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాఠశాల గది ఖాళీగా ఉంది. దీంతో గ్రామంలోని మినీహెల్త్ సెంటర్‌కు ఆ గదిని కేటాయించారు. పాఠశాల ఆవరణంలోనే గ్రామస్థులకు వైద్యసేవలు అందిస్తున్నారు.

పాఠశాల స్థాయిని తగ్గించారు..



రాట్నాపల్లిలో గతంలో 1నుంచి 8వతరగతి వరకు ఉన్న సమయంలో 59 మంది విద్యార్థులు ఉండేవా రు. ఈ యేడాది ప్రాథమిక పాఠశాలగా మార్చారు. 1 నుంచి 5 వరకు మార్చడంతో 8 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చుచేసి పాఠశాలలో అన్ని వసతులు ఏర్పాటు చేసింది. అన్ని గదులకు తాళాలు వేసి ఒక గదిలో మాత్రమే విద్యాబోధన చేస్తున్నారు.

- బీరప్ప, రాట్నాపల్లి

అవగాహన కల్పిస్తున్నాం..

నల్లచెరువు మండలంలోని ప్రతి గ్రామానికి వెళ్లి ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలు, వసతులపై అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా ఉండేదుకు చర్యలు తీసుకుంటాం.

-తిరుపాల్‌నాయక్, ఎంఈఓ



బోయనరసింహులు కుటుంబ సభ్యులతో లోకేశ్

మీకు అండగా నేనుంటా..!
బోయ నరసింహులు కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా 6

స్కూల్ గ్రాంట్ గుటుక్కుపై ఎస్పీడీ సీరియస్

కాంప్లెక్స్ నిధుల ఖర్చుపై విచారణకు ఆదేశం
ఎంఈఓలు, హెచ్‌ఎంలతో డీఈఓ, ఏపీసీ కాన్ఫరెన్స్
బిల్లుల వారీగా పరిశీలనకు కమిటీలు 7

మగ్బూల్‌తో పార్టీ నాశనమే!

- రాజకీయాలకు పనికిరాడు
- వైసీపీ నాయకుల ధ్వజం

కదిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైసీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్‌బాషాపై సొంత పార్టీ నేతలే తిరుగుబాటు చేశారు. మగ్బూల్ రాజకీయాలకు పనికిరాడనీ, ఆయనతో పార్టీ నాశనం అవుతుందని నల్లచెరువు మండలానికి చెందిన వైసీపీ నాయకులు ధ్వజమెత్తారు. ఆయన నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామంటూ తెగేసి చెప్పారు. పట్టణంలోని వైసీపీ నాయకుడు విశ్వనాథ్‌రెడ్డి నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆ పార్టీకి చెందిన జడ్పీటీసీ బసిరెడ్డి అనితమ్మ తదితరులు మాట్లాడారు. మగ్బూల్‌బాషాకు వ్యక్తిత్వమే లేదంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మూడునెలల్లోనే ఆయన నిజస్వరూపం బయటపడిందన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న తమపై సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు పెట్టించడం మగ్బూల్‌కు తగదన్నారు. తాము టీడీపీ కోవర్టులమనీ, గసగసాల వ్యాపారం చేశామనీ, నోటితో చెప్పలేని భాషలో నీచంగా పోస్టులు పెట్టించారని ఆరోపించారు. వాస్తవానికి మగ్బూల్‌కు రాజకీయ నాయకుడి లక్షణాలే లేవన్నారు. పార్టీ మూడునెలల ముందుగా టిక్కెట్ ఇచ్చి పంపితే, ఆయన విజయానికి కృషి చేశామన్నారు. అటువంటి తమపై పోస్టులు పెట్టించడం శోచనీయమన్నారు. కదిరిలో పార్టుటైమ్ రాజకీయాలకు తావు లేదన్నారు. మగ్బూల్ గత ఎన్నికల్లో ఆరు వేల తేడాతో ఓడిపోయాడనీ, భవిష్యత్తులో 60 వేలతో పరాజయం పాలవడం ఖాయమన్నారు. ఆయనను ఇన్‌చార్జిగా నియమించడంపై పార్టీ అధినాయకత్వం ఆలోచించాలని కోరారు. మగ్బూల్ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్నామనీ, ప్రత్యేక కార్యచరణ కూడా చేపడతామన్నారు. సమావేశంలో వైసీపీ నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, దశరథనాయుడు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నల్లచెరువు నాయకులు

ప్రజారోగ్యంపై లెక్కలేనితనం!

గణాంకాల సేకరణలో జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యం
ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఓపీ, ఐపీని పట్టించుకోని వైనం
జనన మరణాలు, ఆరోగ్యశ్రీ వివరాలు మాత్రమే సేకరణ
గణాంకాలు లేకుంటే ప్రజారోగ్యాన్ని సంరక్షించడమెలా?

అనంతపురం వైద్యం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ప్రజారోగ్యం పట్ల 'లెక్క'లేనితనం కనిపిస్తోంది. దీంతో జిల్లా వ్యాప్తంగా వ్యాపిస్తున్న రోగాలు, బాధితుల వంటి పూర్తి వివరాలు లేకుండాపోయాయి. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల కంటే ప్రైవేటు వైపే అధికమంది మొగ్గు చూపుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్తున్న వారిలో ఏఏ జబ్బులతో ఇబ్బందులు పడుతున్నారు? దీర్ఘకాలిక వ్యాధుల బాధితులు ఎంతమంది? సాధారణ జబ్బులతో బాధపడుతున్న వారెందరు? తదితర గణాంకాలు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ వద్ద లేవు. జనన, మరణాలు, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ(ఆరోగ్యశ్రీ)కు సంబంధించిన గణాంకాలు మాత్రమే అధికారులకు అందుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లోని ఓపీ, ఐపీ సేవలకు సంబంధించి ఎటువంటి గణాంకాలు ప్రభుత్వానికి చేరడంలేదు. దీంతో వ్యాధులపై పరిశోధనలు, జబ్బుల నివారణ, తగిన మందుల తయారీ ఎలా సాధ్యపడుతుందని వైద్యనిపుణులు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సర్వేలో కూడా ప్రజలు అన్ని వివరాలు వెల్లడించకపోవడం కూడా గణాంకాల తయారీకి ఇబ్బందికరంగా మారింది.



వ్యాధులను అరికట్టేదెలా..?

పరిశోధన, క్లినికల్ ప్రాక్టీస్, ప్రజారోగ్యం సహా ఆరోగ్య సంరక్షణ వంటి వివిధ అంశాలలో వైద్య, ఆరోగ్య సంబంధిత గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయి. వ్యాధి నమూనాలను అర్థం చేసుకోవడం, చికిత్స ప్రభావాన్ని అంచనా వేయడం, రోగి సంరక్షణ ఆరోగ్య ఫలితాలను మెరుగు పరచడానికి, సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడంలో గణాం కాలు సహాయపడతాయి. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలు, సేవలస్థితి, రోగ నిర్ధారణ, మందులు, రోగి సంతృప్తిపై వివిధ రకాల గణాంకాలు వివరాలు వెల్లడిస్తాయి. అయితే ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి ఎలాంటి గణాంకాలను (మిగతా 6లో..)

అనంత క్రికెటర్ల హవా
ఆంధ్రా అండర్-23 జట్టు ప్రాబబుల్స్‌లో ఆరుగురికి చోటు 7

పగలే చోరీలు



చోరీ చేసిన ఇంటిలో వివరాలు ఆరా తీస్తున్న పోలీసులు 7

సస్పెన్షన్‌పై కుతకుత..!

(5వ పేజీ తరువాయి)

ఎప్పుడూ ఆయనకు మద్దతుగా నిలబడుతూ వస్తున్నారు. వైసీపీ నుంచి సస్పెండ్ చేయడంతో ఆయన వెంట ఉండేవారు ప్రస్తుతం అయోమయంలో పడ్డారు. 2013 ఎన్నికల్లో వైసీపీకి ఎదురుగాలి ఉన్నా, నవీన్ నేతృత్వంలో హిందూపురం మునిసిపాలిటీలో 16 మంది కౌన్సిలర్లను గెలుచుకోగలిగారు. కొండూరు వేణుగోపాల్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఆయన సామాజికవర్గంవారు, ఆయన దగ్గరగా ఉన్న నాయకులు, కార్యకర్తలు వైసీపీపై మండిపడుతున్నారు. సీఎన్‌పీ నాగరాజు తన సామాజికవర్గంలో కొంత బలమున్న నాయకుడే. ఇలాంటివారిని దూరం చేసుకుని పార్టీ ఏం సాధిస్తుందని కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు.

అనుచరులు ఎటు..?

తాజా పరిణామాలు వైసీపీలో గందరగోళం సృష్టించాయి. సస్పెన్షన్‌కు గురైన ఆ ఇద్దరు ముఖ్య నాయకులు, వారి అనుచరవర్గం తదుపరి ఏదారిని ఎంచుకుంటుందో అన్న చర్చ జరుగుతోంది. ముఖ్యంగా వారి అనుచరవర్గం భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. పార్టీని నమ్ముకోవాలా, తమ నాయకులను నమ్ముకోవాలా అన్న ఆలోచనలో పడ్డారు. ఆ ఇద్దరి అనుచరులు వేరే పార్టీలలో చేరుతారా..? పార్టీలోనే ఉండారా..? తటస్థంగా ఉంటారా..? అన్న చర్చ వైసీపీలో జరుగుతోంది. హిందూపురంలో వైసీపీకి పార్టీపరంగా పెద్దగా బలం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో అంతమంది నాయకులు ఏకమైనా బాలకృష్ణకు 32 వేల ఓట్ల మెజార్టీ వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో ముఖ్యనేతలపై వేటువేయడం ద్వారా వైసీపీ బలం మరింత తగ్గుతుందని అంటున్నారు. ఈ ప్రభావం వచ్చే స్థానిక ఎన్నికల్లో తప్పకుండా కనబడుతుందని ఆ పార్టీ ముఖ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎంత కష్టపడినా ఇంతేనా..?

నవీన్ నిశ్చల్ 2013 నుంచి వైసీపీ కోసం ఎంతో కష్టపడ్డారు.. నష్టపోయారు. 2014 నుంచి 2019 వరకు తెలుగుదేశం హయాంలో వైసీపీ తరుపున పలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో కొన్ని కేసులు నమోదయ్యాయి. ఆ తరువాత కూడా పార్టీకోసం కష్టపడుతూ వచ్చారు. అలాంటి నాయకుడిపై వేటు వేయడం ఆయన అనుచరులకు నచ్చడం లేదు. ఈ పార్టీకి ఎంత కష్టపడినా ఇంతేనా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జగన్‌తో వేణుగోపాల్ రెడ్డి(ఫైల్)

ఇదంతా పార్టీలోని రాజకీయ కుట్ర అని ఆయన వర్గం భావిస్తోంది. ముఖ్య నేతలను సస్పెండ్ చేసేటప్పుడు కనీసం ముందస్తు సమాచారం ఇవ్వాలి కదా అని ఆయన వర్గం ప్రశ్నిస్తోంది. కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వర్గీయులు కూడా పార్టీ నాయకత్వంపై గుర్రుగా ఉన్నారు. వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహించడం ద్వారా పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేశామని, అయినా సస్పెన్షన్‌ను బహుమానం ఇచ్చారని బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు. కష్టపడినవారిని సస్పెండ్ చేస్తూ పోతే ఆఖరికి సస్పెండ్ చేసేవారు, చేయించిన వారే పార్టీలో మిగులుతారని ఎద్దేవా చేస్తున్నారు.

దీపిక వర్గంపై గుర్రు

'ఇన్నేళ్లు పార్టీకోసం కష్టపడ్డాం. ఎంతో కాలాన్ని, డబ్బుల్ని నష్టపోయాం. కర్ణాటక నుంచి దిగుమతి చేసుకున్న ఓ మహిళ కోసం పార్టీ మా పైనే చర్యలు తీసుకుంది' అని నవీన్ నిశ్చల్, వేణుగోపాల్ రెడ్డి వర్గీయులు మండిపడుతున్నారు. దీపిక వర్గంపై గుర్రుగా ఉన్నారు.



తమ సత్తా ఏమిటో స్థానిక ఎన్నికల్లో చూపిస్తామని సవాలు విసురుతున్నారు. 'పార్టీని వీడం. దీపిక వర్గం బలమేమిటో.. మా బలమేమిటో నియోజకవర్గంలో చూపించి.. ఆ తరువాతే అధినాయకత్వానికి అల్టిమేటం ఇస్తాం' అని వారి అనుచరులు అంటున్నారు. తాజా పరిణామాలపట్ల వైసీపీలో ఒక వర్గంలో సంబరాలు.. మరో వర్గంలో ఆగ్రహావేశాలు వ్యక్తమౌతున్నాయి.

నా పోరాటాలకు ఇది గిఫ్ట్

● నవీన్ నిశ్చల్ ఆవేదన

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటాలుచేసి, కేసులు పెట్టించుకున్నందుకు వైసీపీ ఇచ్చిన బహుమతి తన సస్పెన్షన్ అని నవీన్ నిశ్చల్ ఆవేదన వ్యక్తం చేశారు. నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డి సహా ఆరుగురిని వైసీపీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. దీంతో నవీన్ నిశ్చల్ గురువారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ కుమారుడు నందమూరి బాలకృష్ణపై పోరాటం చేశామని, ఆ సందర్భంలో తమపై కేసులు పెట్టారని అన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణపై పోరాటాలు చేయడం ఆషామాషీ కాదని, అలాంటి నాయకుడిపై పోరాటం చేసిన తనపై సస్పెన్షన్ వేటు వేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 2019, 2024లో ఎన్నికల్లో వైసీపీ సూచించిన అభ్యర్థులకోసం కష్టపడి పనిచేశానని అన్నారు. ఎన్నికల్లో తాను పని చేయలేదంటే ఏ దేవుడివద్దయినా ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. రాజకీయ కుట్రతో తనపై ఈ నిర్ణయం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన దీపిక కర్ణాటకలో నివాసం ఉంటారని, అలాంటి ఆమెకు ఇక్కడ టిక్కెట్ ఇచ్చారని విమర్శించారు. సాధారణంగా సిట్టింగ్ ఎమ్మెల్యేపై ప్రజల్లో వ్యతిరేకత ఉంటుందని, కానీ 2014, 2019, 2024 ఎన్నికలలో టీడీపీ అభ్యర్థికి మెజార్టీ పెరుగుతూ వచ్చిందని అన్నారు. దీన్నిబట్టి 2019, 2024 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల బలమేమిటో అర్థం అవుతోందని అన్నారు.



తాను వేరే పార్టీలో చేరడం లేదని, తన తండ్రి డాక్టర్ సాయిప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడతానని అన్నారు. తనను నమ్ముకున్న అనుచరులు, కార్యకర్తల కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తానని అన్నారు. వైసీపీ తనపై సస్పెన్షన్ ఎత్తివేసి.. 2029 ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని, లేదంటే స్వతంత్ర అభ్యర్థిగా రంగంలో దిగుతానని స్పష్టం చేశారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో తన సత్తా చూపిస్తానని అన్నారు. తాను ఫ్లెక్సీలు వేయడం, పార్టీలో కుమ్ములాటలు ఉన్నాయని చెప్పడం తప్పైందని అన్నారు. పార్టీ పెద్దలు తనపై కుట్ర పన్నారని ఆరోపించారు.

తగ్గిన అంజన్న హుండీ ఆదాయం



హుండీ కానుకలు లెక్కిస్తున్న భక్తులు

బొమ్మనహాళ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయ హుండీ ఆదాయం ఈ ఏడాది స్వల్పంగా తగ్గింది. హుండీల ఆదాయాన్ని ఆలయంలో గురువారం దేవదాయ శాఖాధికారులు లెక్కించారు. ఈ ఏడాది రూ.15.14 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ఆ మొత్తాన్ని బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. గతేడాది 15.37 లక్షలు రాగా.. ఈసారి రూ.23 వేలు ఆదాయం తగ్గిందన్నారు. హుండీ లెక్కింపులో ఈఓలు నరసింహారెడ్డి, దేవదాస్, విజయకుమార్, మాజీ ధర్మకర్త శాంతయ్య, టీడీపీ నాయకులు గాలి బసప్ప, బెళ్లి హనుమంతరెడ్డి, రమేష్, ఎస్‌బీఐ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నెట్టికంటికి గజవాహనం

సమర్పించిన బళ్లారి భక్తుడు

గుంతకల్లు టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవాలయానికి బళ్లారికి చెందిన భక్తులు.. ఇత్తడి గజవాహనాన్ని సమర్పించారు. బళ్లారికి చెందిన హెచ్‌ఆర్‌జే రామకృష్ణ.. స్వామివారికి ఇత్తడి గజవాహనం చేయించి ఆలయ అధికారులకు గురువారం అప్పగించారు. యాగశాలలో వేదపండితులు గజవాహనానికి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వాణి, సిబ్బంది పాల్గొన్నారు.



గజవాహనానికి పూజలు చేస్తున్న వేదపండితులు

మీకు అండగా నేనుంటా..!

బోయ నరసింహులు కుటుంబానికి మంత్రి లోకేశ్ భరోసా

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఫ్యాక్షన్ బారిన పడి నష్టపోయిన బోయ నరసింహులు కుటుంబాన్ని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఉండవల్లిలోని తన నివాసానికి గురువారం పిలిపించుకుని మాట్లాడారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ధర్మవరం నియోజకవర్గంలోని కామిరెడ్డిపల్లికి చెందిన దాసరి నరసింహులు టీడీపీలో మొదటి నుంచి క్రియాశీలకంగా ఉండేవారు. దీంతో ప్రత్యర్థులు 2011లో దారికాచి, ద్విచక్రవాహనంపై వెళుతున్న బోయ నరసింహులు, ఆయన కుమారుడు, కూతురును దారుణంగా హత్య చేశారు. ఈ హత్యలు ఉమ్మడి రాష్ట్రంలో సంచలనం రేపాయి. ఫ్యాక్షన్ బారిన పడి బోయ నరసింహులు కుటుంబం ఎంతగానో నష్టపోయింది. అప్పట్లోనే టీడీపీ అధినేత చంద్రబాబు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తాజాగా వారి బాగోగులను మంత్రి నారా లోకేశ్ స్వయంగా తెలుసుకున్నారు. ఆనాటి ఫ్యాక్షన్ హత్యల ఘటన నుంచి రెండు నెలల బాలుడు మృత్యుంజయుడిగా బయటపడ్డాడు. ఆ బాలుడిని మంత్రి నారా లోకేశ్ ఆప్యాయంగా పలకరించారు. బాగా చదువుకుని, ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. తమ యోగక్షేమాలు తెలుసుకున్న మంత్రి లోకేశ్‌కు నరసింహులు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

కరెంటు మీటరు మాటున మోసం

పుట్లూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇంటికి విద్యుత్ మీటరు బిగిస్తానంటూ మహిళను నమ్మించి, ఓ దుండగుడు రూ.4 వేలు కాజేశాడు. స్థానిక బీసీ కాలనీకి చెందిన తలారి బాలమ్మను బురిడీ కొట్టించిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ మోసంపై బాధితురాలు.. గురువారం విద్యుత్ శాఖాధికారులకు ఫిర్యాదు చేసింది. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాను లైన్‌మన్ అంటూ రెండు నెలల క్రితం ఓ దుండగుడు ఫోన్ చేశాడు. ఇంటికి విద్యుత్ మీటరు బిగిస్తానంటూ నమ్మించాడు. అందుకు రూ.4 వేలు ఖర్చవుతుందని తెలిపాడు. దీంతో ఆ మొత్తాన్ని బాలమ్మ ఫోన్ పే ద్వారా ఆ దుండగుడికి పంపింది. ఆ తర్వాత అతడు అడ్రస్ లేకుండా పోయాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు.. ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని కోరింది.

మెజారిటీ ఉన్నా గెలిపించుకోలేని దద్దమ్మ

ప్రకాశ్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'మండల పరిషత్ ఎన్నికల్లో మెజారిటీ సభ్యుల బలం ఉన్నా ఎంపీపీ స్థానాన్ని గెలుచుకోలేని దద్దమ్మవు నీవు' అంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తంచేశారు. రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక కోరంలేక నాలుగోసారి వాయిదా పడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న విమర్శలపై ఎమ్మెల్యే పరిటాల సునీత గురువారం వెంకటాపురంలోని తన నివాసంలో ఘాటుగా స్పందించారు. ఎంపీపీ ఎన్నికకు మూడుసార్లు నోటిఫికేషన్ వచ్చిందనీ, ప్రతిసారీ వైసీపీ ఎంపీటీసీలను ప్రకాశ్ రెడ్డి బలవంతంగా క్యాంపులకు తరలిస్తున్నాడన్నారు. ఆనక, తామేదో చేసినట్లు ప్రకాశ్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నాడన్నారు. తమ మండలంలో దౌర్జన్యాలు చేస్తున్నామంటూ విషప్రచారం చేస్తున్నాడని మండిపడ్డారు. మెజారిటీ సభ్యులు ఉన్నపుడు ఎన్నికకు ఎందుకు హాజరు కాలేదని నిలదీశారు. సొంత ఎంపీటీసీలపై నమ్మకంలేక ప్రకాశ్‌రెడ్డి డ్రామాలాడుతున్న విషయం అందరికీ తెలుసన్నారు. దానిని కప్పిపుచ్చి, తాము విఫలమయ్యామంటూ ప్రచారం చేస్తున్నాడని విరుచుకుపడ్డారు. ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకోవాలనుకుంటే ఎప్పుడో గెలుచుకునేవారమన్నారు. 8 నెలల్లో ఎంపీటీసీ ఎన్నికలు ఉండగా.. ఎంపీపీ స్థానం కోసం ఎందుకు ప్రయత్నిస్తామని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో ప్రకాశ్‌రెడ్డి గొడవలు సృష్టించి కార్యకర్తలు కేసుల్లో ఇరుక్కునేలా చేశాడన్నారు. ఇప్పుడు వారిని కూడా వదిలేసి పారిపోయాడనీ, ఏ కలుగులో దాక్కున్నాడోనంటూ ఎద్దేవా చేశారు. ధైర్యంగా బయటకు వచ్చి మాట్లాడాలని సవాల్ విసిరారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు రామ్మూర్తినాయుడు, మండల కన్వీనర్ సుధాకర్, ప్రధానకార్యదర్శి ఆవుల ముత్యాలు, నాయకుడు లింగా శ్రీధర్‌నాయుడు, ఎంపీటీసీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీపీఓపై జేసీపీఆర్ ఆగ్రహం

వివిధ సమస్యలపై నిలదీత

జవాబు చెప్పకపోవడం పట్ల మండిపాటు

జడ్పీ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి



డీపీఓతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

అనంతపురం న్యూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి) జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు తీరుపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సమస్యలపై డీపీఓను కలవడానికి జేసీ ప్రభాకర్‌రెడ్డి గురువారం డీపీఓ కార్యాలయానికి వచ్చాడు. అయితే డీపీఓ జడ్పీ సమావేశంలో ఉన్నాడని తెలుసుకుని అక్కడకు వెళ్లాడు. అప్పటికే సమావేశం ముగించుకొని డీపీఓ కిందకు వచ్చారు. ఆయన్ను చూసిన జేసీ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడాలని చెప్పడంతో ఇద్దరూ డీపీఆర్‌సీ భవనంలోకి వెళ్లారు. అక్కడ పలు సమస్యలపై జేసీ ప్రభాకర్‌రెడ్డి డీపీఓను నిలదీసినట్లు సమాచారం. దీంతో కలత చెందిన డీపీఓ తన వద్ద ఉన్న పేపర్లను కూడా జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్దే ఉంచి బయటకు వచ్చేశాడు. దీంతో మరింత ఆగ్రహానికి లోనైన మున్సిపల్ చైర్మన్ నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వెళ్లిపోతున్నాడు. ఆపండి అంటు గట్టిగా అరిచాడు. దీంతో వాహనంలో వెళుతున్న డీపీఓను జేసీ ప్రభాకర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. అయితే ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడటానికి కూడా డీపీఓ ఆసక్తి చూపకపోవడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం జేసీ ప్రభాకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తాడిపత్రి మండలంలో జరిగిన అక్రమాల్లో డీపీఓకు భాగం ఉందని ఆరోపించారు. ఉన్నతాధికారుల నివేదికకు అనుగుణంగా చర్యలు తీసుకోవడానికి ఈయనకు ఏమిటి సమస్య అని ప్రశ్నించారు. ఉదయం నుంచి కాపలా కాస్తున్నాం. ఇప్పుడు వచ్చి సరైన సమాధానం ఇవ్వకుండా వెళ్లిపోవడం సమంజసమా అని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

కారణం ఏమిటంటే..

తాడిపత్రి మండలంలోని 3 పంచాయతీల్లో విచ్చల విడిగా అక్రమలే అవుట్లు వేసినట్లు తెలిసింది. వీటిపై చర్యలు తీసుకోవాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే అహుడా నివేదికకు అనుగుణంగా చర్యలు చేపట్టడంలో డీపీఓ నాగరాజునాయుడు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటం, పలుమార్లు ఫోన్‌లో సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డీపీఓను కలవడానికి స్వయంగా జేసీ ప్రభాకర్‌రెడ్డి వచ్చారు. అలాగే డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5 బదిలీల్లో ఎమ్మెల్యే సిఫార్సు చేసిన వాటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడం మరోకారణంగా చెబుతున్నారు. కాగా జిల్లా పంచాయతీ అధికారి సీసీగా ఉన్న డిజిటల్ అసిస్టెంట్ కూడా ఈ వివాదానికి సగం కారణంగా చెబుతున్నారు.

రగ్బీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కడపల

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రగ్బీ అసోసియేషన్ కార్యదర్శిగా కడపల శంకర్ ఎంపికయ్యారు.



జిల్లా కార్యదర్శిగా కడపల శంకర్‌ను ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు గురువారం తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రగ్బీ ఆటను అభివృద్ధి చేస్తూ, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులను తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా వారు తెలిపారు.

నేడు అనంతకు మంత్రి నారాయణ

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ నేడు జిల్లాకు వస్తున్నారు. అనంతపురం నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో కలిసి ఉదయం 9.30 గంటలకు మంత్రి ప్రారంభిస్తారు. ఒకటో డివిజన్‌లో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొంటారు.

అదిగో చిరుత ..!



గ్రానైట్ కొండపై సంచరిస్తున్న చిరుత

కంబదూరు, జూలై 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి సమీపంలోని గ్రానైట్ కొండలో గురువారం చిరుత కనిపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉదయం కొండ సమీపంలోని ఓ తోట వద్ద రైతు వెంకటేశులు మేకలు మేపుతుండగా, మందలో ఉన్న ఓ మేకను చంపి ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గ్రానైట్ కొండ వద్ద పనిచేస్తున్న కూలీలు, రైతులు చిరుతను గమనించి వీడియోను తీసి, దాన్ని అటవీశాఖాధికారులకు పంపించారు. కొండకు సమీపంలో తోటలు ఉన్న రైతులు చిరుత భయంతో రాత్రి పూట పంటలకు నీటి తడులు ఇవ్వ డానికి వెళ్లేందుకు కూడా భయపడుతున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి చిరుతను బంధించాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

స్టాంపులు వచ్చేశాయ్

జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖకు

రూ.3.44కోట్ల విలువైన స్టాంపులు

అనంతపురం కలెక్టరేట్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖకు పెద్ద మొత్తంలో స్టాంపులు చేరాయి. ప్రధానంగా నాన్‌జ్యూడీషియల్ స్టాంపులతో పాటు కోర్టు ఫీజు లేబుల్స్ స్పెషల్ అడియేషివ్ స్టాంప్స్ గురువారం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరాయి. వీటి మొత్తం విలువ రూ.3,44,90,000 ఉన్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రూ.100ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు రూ.56లక్షల స్టాంపులు, రూ.50 ముఖ విలువ కలిగిన రూ.24లక్షల స్టాంపులు వచ్చాయి. రూ.2,64,90,000ల విలువైన కోర్టు ఫీజు లేబుల్స్, స్పెషల్ అడియేషివ్ స్టాంప్స్ అందాయి. అయితే రూ.10,రూ.20ల ముఖ విలువ కలిగిన నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఈ సారి రాలేదని అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ స్టాంపులను జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిణీ చేయనున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయండి: కలెక్టర్

రేపు రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ ప్రారంభోత్సవం

అనంతపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్ ప్రారంభం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్న జేఎన్‌టీయూ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 19న రతన్ టాటా ఇన్నొవేషన్ సెంటర్‌ను తిరుపతి నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను వేగంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీఈ రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్‌అండ్‌బీ జేఈ బాలకాటమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పాత పెన్షన్ కోసం నేడు పోరు

నిరసనకు డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల పిలుపు

అనంతపురంవిద్య, జూలై17(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలంటూ డీఎస్సీ-2003 ఉపాధ్యాయులు భారీ నిరసనకు సిద్ధమయ్యారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టాలని పోరాట ఫోరం నిర్ణయం తీసుకుంది. అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మద్దతు కోరారు. కుటుంబ సభ్యులతో కలిసి ఈ నిరసన కొనసాగించడానికి ఏర్పాట్లు చేపట్టారు. అన్నివర్గాల ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాతపెన్షన్ కోసం చేస్తున్న పోరాటానికి మద్దతు ఇవ్వాలని డీఎస్సీ 2003 ఫోరం కమిటీ సభ్యులు మధుప్రసాద్, ఎంఎంపీ ప్రసాద్, నాగభూషణం,కే.శ్రీనివాసులు, సాయినాథ్ రెడ్డి, కట్టయ్య, ప్రసన్నలక్ష్మి, ఎర్రిస్వామి గురువారం ఓ ప్రకటనలో విన్నవించారు.

ఆధునిక సేద్యంపై అవగాహన పెంచాలి

నంద్యాల ఏడీఆర్ జాన్సన్

బుక్కరాయసముద్రం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో ఆధునిక, సాంకేతిక పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచాలని నంద్యాల వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహాయ సంచాలకుడు జాన్సన్.. శాస్త్రవేత్తలకు సూచించారు. మండలంలోని రెడ్డిపల్లి వద్ద గల కృషివిజ్ఞాన కేంద్రంలో గురువారం రాయలసీమ పరిధి కేవీకే, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు, కోఆర్డినేటర్లకు రెండు రోజుల శిక్షణను ప్రారంభించారు. ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉంటుందన్నారు. తద్వారా పెట్టుబడులు తగ్గించి, రైతులకు ఆదాయం చేకూరేలా చొరవ చూపాలన్నారు. పరిశోధనల ఫలాలు రైతులకు చేరాలన్నారు. లేదంటే పరిశోధనలు వృథా అవుతాయన్నారు. కార్యక్రమంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు, శాస్త్రవేత్తలు భార్గవి, కేవీకే కోఆర్డినేటర్ మల్లీశ్వరి తదితర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ చేతివాటం

టిక్కెట్ సొమ్ము జేబులోకి.. అధికారుల తనిఖీలో బట్టబయలు

అనంతపురం టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ఓ ఆన్ కాల్ (ప్రైవేటు) డ్రైవర్ చేతివాటాన్ని ప్రదర్శించాడు. కర్నూలు సమీపంలోని చిన్నటేకూరు వద్ద ఆర్టీసీ చెకింగ్ స్క్వాడ్ తనిఖీల్లో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. అనంతపురం డిపోకి చెందిన సూపర్ లగ్జరీ బస్సు గురువారం ఉదయం 7.30 గంటలకు అనంతపురం బస్టాండు నుంచి కర్నూలు వైపు వెళ్లింది. సదరు బస్సుకు డ్రైవర్‌గా వెళ్లిన బీఎస్ వాసులు ఆర్టీసీలో ప్రైవేటు డ్రైవర్‌గా రోజువారీ వేతనంతో పనిచేస్తున్నాడు. అతడికే ఆర్టీసీ అధికారులు టిక్కెట్ల జారీ యంత్రం (టిమ్) అప్పగించారు. అతడే టికెట్లు కొడుతూ వెళ్లాడు. కొందరు ప్రయాణికుల నుంచి డబ్బు తీసుకుని, టిక్కెట్ ఇవ్వకుండా తన జేబులో వేసుకున్నాడు. బస్సు చిన్నటేకూరు వద్దకు చేరుకోగానే ఆర్టీసీ చెకింగ్ స్క్వాడ్‌కు చెందిన ఎస్టీఐ పక్కీరప్ప, టీటీఐ జాఫర్ తనిఖీ చేపట్టారు. కొందరు ప్రయాణికులు డబ్బు చెల్లించినా తమకు టిక్కెట్ ఇవ్వలేదని అధికారులకు తెలపడంతో డ్రైవర్ బీఎస్ వాసులుపై కేసు నమోదు చేశారు. ఇదే అంశంపై అనంతపురం డీఎం నాగభూపాల్‌ను వివరణ కోరగా.. టిక్కెట్లు జారీ చేయకపోవడం వాస్తవమేననీ, డ్రైవర్‌ను విచారించిన అనంతరం తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

ఏపీఎల్ జట్టు హెడ్ కోచ్‌గా ప్రసాద్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ కింగ్స్ జట్టు హెడ్ కోచ్‌గా జిల్లాకు చెందిన సీనియర్ క్రికెటర్ ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి నియమితుడయ్యారు. దీంతో ఆయనకు సీనియర్ క్రికెటర్లు అభినందనలు తెలిపారు. ఆగస్టు 8 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలో ఏపీఎల్ పోటీలు నిర్వహించనున్నారు.



ప్రజారోగ్యంపై లెక్కలేనితనం..!

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వం సేకరించకపోతే వ్యాధులను అరికట్టి ప్రజారోగ్యాన్ని సంరక్షించడం కష్టసాధ్యం అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే ఎన్టీఆర్ వైద్య సేవ కింద ప్రభుత్వం ప్రైవేటు ఆస్పత్రులకు రీయింబర్స్ నిధులను చెల్లిస్తుంది కాబట్టి సంబంధిత ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్లు మాత్రం 'లెక్క'లకోసం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవల నెట్‌వర్క్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. మిగతా వివరాలు ఏమీ ఉండటం లేదు.

233 ప్రైవేట్ ఆసుపత్రులు

జిల్లాలో 233 ప్రైవేట్ ఆసుపత్రులున్నాయి. ఇందులో 100 పడకల సామర్థ్యంతో 28, 50 పడకలు 77, 20 పడకలు 128 ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో అత్యధికంగా అనంతపురం నగరం, రూరల్ ప్రాంతంలోనే నెలకొల్పారు. అందులోనూ సూపర్ స్పెషాలిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించినవే కావడం విశేషం. వీటిలో కొన్ని సొంతంగా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసుకుని ఓపీ, ఐపీ రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకుంటున్నాయి. ఇక ఆర్ఎంపీలు ఏర్పాటు చేసుకున్న ప్రథమ చికిత్స కేంద్రాలు రిజిస్ట్రేషన్ ఆస్పత్రుల కంటే రెట్టింపు సంఖ్యలో ఉంటాయని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వీటిని సక్రమంగా గణాంకాలు సేకరించడం లేదనే విమర్శలు ఉన్నాయి.

'అనంత' ఖర్చులు...

ఇతర ప్రాంతాలతో పోల్చినప్పుడు అనంతపురం జిల్లా ప్రజలు వారి ఆదాయంలో 40 నుంచి 50శాతం కేవలం ఆరోగ్య సంరక్షణకే ఖర్చు చేస్తున్నట్లు ఆరోగ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏ వ్యక్తిని కదిలించినా ఏదో ఒక వ్యాధితో ఇబ్బంది పడుతున్నట్లు చెబుతారు. మధుమేహం, కిడ్నీ, కాలేయం, గర్భసంచి, నరాలు తదితరాల జబ్బుల నుంచి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్స కోసం అధికంగా ఖర్చు చేస్తున్నారు. ఈ జబ్బులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేకపోవడానికి వైద్య ఆరోగ్యశాఖ నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి వద్ద ఖచ్చితమైన గణాంకాలు ఉండి ఉంటే తదుపరి ఎవరూ బాధితులు కాకుండా ఉండేలా చర్యలు తీసుకునే అవకాశం ఉండేదనే మాటలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం: డాక్టర్ ఈబీ దేవి, డీఎంహెచ్ఓ



ప్రైవేట్ ఆస్పత్రుల్లోని ఓపీ, ఐపీ సేవల వివరాలను ఖచ్చితంగా నమోదు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ప్రైవేట్ ఆస్పతుల యాజమాన్యాలు వారి సొంత సాఫ్ట్‌వేర్‌లో ఓపీ, ఐపీ వివరాలు నమోదు చేసుకుంటున్నారు. ప్రభుత్వం చెల్లించే రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన గణాంకాలు మాత్రమే డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ వెబ్‌పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేపట్టిన ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్(ఆబా) విధానాన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ అమలు చేసేలా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

జనన, మరణాలే నమోదు: షేక్ మహమ్మద్ రఫీ, గణాంక అధికారి



ప్రైవేట్ ఆస్పత్రుల్లోని జనన, మరణాలు మాత్రమే జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో నమోదు అవుతున్నాయి. ఈ రెండు అంశాలకు సంబంధించినవి మాత్రమే ప్రైవేట్ ఆస్పత్రుల్లో సక్రమంగా రిజిస్టర్ అవుతున్నాయి. అదికూడా ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి సంబంధిత పరిధిలోని అర్బన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పేపర్ రూపంలో రికార్డులు అందుతున్నాయి. వాటిని ఒక్కొక్కటిగా ఆన్‌లైన్ చేసి ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నాం.

గొర్రె కోసం వెళితే.. కాటేసిన మృత్యువు



రామమోహన్ (ఫైల్)

యల్లనూరు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్గుపల్లి గ్రామంలో గురువారం ఉదయం విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి రామమోహన్ (45) మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రామమోహన్ గురువారం ఉదయం గొర్రెల మంద వద్దకు వెళ్లాడు. ఒక గొర్రె కనిపించలేదని ఆయన తమ్ముడు నారాయణస్వామి తెలపడంతో దాన్ని వెతకడానికి వెళ్లాడు. దగ్గరలో ఉన్న గుట్టపైకి ఎక్కుతూ ప్రమాదవశాత్తు అక్కడే ఉన్న ప్రధాన విద్యుత్ తీగకు తగిలాడు. దీంతో విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎంతసేపటికి రామమోహన్ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయనను వెతకడం ప్రారంభించారు. మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో గుట్టపై విగతజీవిగా పడి ఉన్న రామమోహన్ కనిపించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. మృతుడికి భార్య సులోచన, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సదరం కోసం వచ్చి మిస్సింగ్



రామకృష్ణ(ఫైల్)

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మండలం చిన్న పొడమల గ్రామానికి చెందిన కమ్మగార్ల రామకృష్ణ కనిపించకుండా పోయాడు. దీంతో బాధితుడి తమ్ముడు రామ్మోహన్ గురువారం అనంతపురం టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు రామకృష్ణ(39)కు మాటలు రావు. ఈ నెల 16న ఉదయం సదరం సర్టిఫికెట్ పునఃపరిశీలన కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి వచ్చా డు. తిరిగి ఇంటికి వెళ్లలేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో రామ్మోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. రామకృష్ణ కనిపిస్తే 9440796806 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు.

హత్య కాదు.. గుండెపోటే..



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బొమ్మనహాళ్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన వన్నూరుస్వామి (45) మద్యానికి బానిసయ్యాడు. తరచూ కుటుంబ సభ్యులతో గొడవపడుతుండేవాడు. గురువారం ఉదయం మద్యం తాగి కొడుకు మోహన్‌తో గొడవపడ్డాడు. అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన బళ్లారి ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అతడు మరణించినట్లు తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. వన్నూరుస్వామిని కొడుకు హత్య చేశాడంటూ ప్రచారం జరిగింది. విషయం ఆ నోటా.. ఈ నోటా.. పోలీసుల చెవిన పడింది. ఎస్ఐ నబీరసూల్, ఏఎస్ఐ హనుమంతరెడ్డి, సిబ్బంది గ్రామానికెళ్లి వన్నూరుస్వామి శవాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం కోసం బళ్లారి విమ్స్‌కు తరలించారు. పోస్టుమార్టం నివేదికలో హత్య జరగలేదని తేలినట్లు సమాచారం. గుండెపోటు అయి ఉంటుందని డాక్టర్లు చెప్పినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగలున్నారు జాగ్రత్త: ఎస్ఐ



సత్యహరిశ్చంద్రుడు



అంకన్న

తనకల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలో దొంగల గ్యాంగ్ తిరుగుతున్నట్లు గుర్తించామని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఎస్ఐ గోపీ గురువారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలానికి చెందిన దాసరి వెంకన్న అలియాస్ చెంచు అంకన్న, అతడి అనుచరులు చెంచు సత్యహరిచంద్రుడు, ఓ మహిళ సభ్యులుగా గాల ముఠా దొంగతనాలకు పాల్పడుతోందన్నారు. వీరు తాళం వేసిన ఇళ్లలో చోరీలు, రహదారి పక్కన ఉన్న బంక్‌లను పగలకొట్టడం, సిగరెట్లు, గ్యాస్ సిలిండర్లు వంటి వస్తువులు చోరీ చేయడం లాంటివి చేస్తుంటారన్నారు. ప్రజలు ఇళ్లకు తాళం వేసి వెళ్లే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీ పరిసరాల్లో అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే తనకల్లు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫోన్‌నెం.934691718కు లేదా 100 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

చెన్నమ్మను మింగిన గంగమ్మ



చెన్నమ్మ(ఫైల్)

పెనుకొండ రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ చెరువులో పడి మృతి చెందిన సంఘటన గురువారం వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు కోనాపురం గ్రామానికి చెందిన బోయ కిష్టప్ప భార్య చెన్నమ్మ(48) బుధవారం ఉదయం ఆవులను మేపేందుకు కొండాపురం సమీపంలోని ముత్యాలచెరువు సమీపానికి తీసుకెళ్లారు. సాయంత్రం 4గంటల వరకు తోటి కాపరులతో కలిసి ఆవులు మేపారు. 6గంటల సమయంలో చెన్నమ్మకు చెందిన ఆవులు ఒక్కొక్కటిగా ఇంటికి వచ్చేశాయి. అయితే ఆమె మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ముత్యాలచెరువు పరిసర ప్రాంతంలో గాలించారు. ఆచూకీ లభ్యంకాలేదు. గురువారం ఉదయం ముత్యాలచెరువుకు వచ్చే వంక సమీపంలో చెన్నమ్మ శవమై కనిపించడంతో గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని చెరువులో ఉన్న చెన్నమ్మ మృతదేహాన్ని వెలికితీయించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భర్త కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలున్నారు. చెన్నమ్మ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ఆ మూడు రోజులు తపాలా సేవలకు అంతరాయం

సూపరింటెండెంట్ ఆదినారాయణ

అనంతపురంవిద్య, జూలై17(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో ఈనెల 19, 20, 21 తేదీల్లో తపాలా సేవలకు అంతరాయం వాటిల్లుతుందని పోస్టల్ సూపరింటెండెంట్ ఆదినారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేస్తున్నామన్నారు. ఈ కారణంగా సేవలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈనెల 22న సేవలు పొందవచ్చని తెలిపారు.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కు నిధుల వరద

బడ్జెట్‌లో కేటాయింపుల వివరాలు విడుదల



గుంతకల్లు, జూలై 17(ఆంధ్రజ్యోతి): 2025-26 కేంద్ర బడ్జెట్‌లో గుంతకల్లు రైల్వే డివిజన్‌కు కేటాయించిన నిధుల వివరాలు వెల్లడయ్యాయి. బడ్జెట్‌ను ప్రకటించిన వెంటనే జోన్లవారీగా కేటాయింపులను విడుదల చేసేవారు. కానీ ఈసారి ఆలస్యంగా వివరాలను వెల్లడించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో కొత్త ప్రాజెక్టుల తుది సర్వేలకు, పలు డబ్లింగ్ ప్రాజెక్టులకు, కొత్త ప్రాజెక్టులకు, ఎల్సీల తొలగింపునకు, ట్రాక్ రెన్యువల్‌కు, ట్రాక్ ప్రొటెక్షన్ ఏర్పాటుకు భారీగా నిధులను కేటాయించారు.

తుది సర్వేలకు..

- అకోలా-డోన్ మధ్య డబ్లింగ్ లైన్ (626 కి.మీ.) తుది సర్వేకు రూ.7.83 కోట్లు
- ధర్మవరం-పాకాల-కాట్పాడి డబ్లింగ్ లైన్ (290 కి.మీ.) సర్వేకు రూ.3.63 కోట్లు
- గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ లైన్ (29 కి.మీ.) సర్వేకు రూ.58 లక్షలు
- పాకాల-తిరుపతి డబ్లింగ్ లైన్ (నం.42) తుది సర్వేకు రూ.84 లక్షలు
- ముద్దనూరు-పులివెందుల-ముదిగుబ్బ లైన్ (110 కి.మీ.) సర్వేకు రూ.2.75 కోట్లు
- యర్రగుంట్ల బైపాస్ లైన్ సర్వేకు రూ.11 లక్షలు
- బళ్లారి-నంచెర్ల బైపాస్ లైన్ తుది సర్వేకు రూ.42 లక్షలు
- గుంతకల్లు వెస్ట్-మల్లప్పగేట్ బైపాస్ లైన్ తుది సర్వేకు 24 లక్షలు
- గుత్తి రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) ట్రాక్ నిర్మాణం సర్వేకు రూ.40 లక్షలు
- ఓబుళవారిపల్లి-గుంతకల్లు ట్రిపుల్, ఫోర్ లైన్ల సర్వే కోసం రూ.9.68 కోట్లు
- రేణిగుంట-గూడూరు 3వ లైన్ సర్వేకు రూ.1.66 కోట్లు

లైన్ల నిర్మాణానికి..

- నంద్యాల-యర్రగుంట్ల (126 కి.మీ.) రూ.1,029.85 కోట్లు
- ఓబుళవారిపల్లె-కృష్ణపట్నం (113 కి.మీ.) రూ.465.35 కోట్లు
- కడప-బెంగళూరు (225.4 కి.మీ.) రూ.959.07 కోట్లు
- గుంతకల్లు-గుంటూరు (401.47 కి.మీ.) రూ.1,944.97 కోట్లు
- అకోలా-డోన్ డబ్లింగ్ (626 కి.మీ.) రూ.4,686.09 కోట్లు
- గుత్తి-పెండేకల్లు డబ్లింగ్ (29.225 కి.మీ.) రూ.351.83 కోట్లు
- గుంతకల్లు వెస్ట్-నంచెర్ల బైపాస్ (11.475 కి.మీ.ల) రూ.164.58 కోట్లు
- గూడూరు-రేణిగుంట 3వ లైన్ (83.17 కి.మీ.) 877.34 కోట్లు
- గుత్తి వద్ద ఫ్లై ఓవర్ లైన్ (12 కి.మీ.) 354.33 కోట్లు
- కంబం-ప్రొద్దుటూరు లైన్‌కు రూ.142 కోట్లు

ఇవి కాక..

గుంతకల్లు రైల్వే ఎలక్ట్రికల్ లోకో షెడ్ నిర్మాణానికి రూ.86 కోట్ల నిధులను కేటాయించారు. కర్నూలు కోచ్ రిహాబిలిటేషన్ వర్క్‌షాప్ నిర్మాణానికి రూ.540 కోట్ల కేటాయింపులు జరిగాయి. ధర్మవరం-పాకాల-తిరుపతి, వాడి-గుత్తి-రేణిగుంట సెక్షన్లలో ఎల్సీల తొలగింపునకు భారీగా నిధులు కేటాయించారు. రైల్వే డివిజన్‌లో 47.202 కి.మీ. ట్రాక్ రెన్యువల్‌కు రూ.60 కోట్లను ఇచ్చారు. సేఫ్టీ కేటగిరి కింద రైల్వే డివిజన్ వ్యాప్తంగా ట్రాక్ ఫెన్సింగ్ నిర్మాణానికి నిధులిచ్చారు.

స్కూల్ గ్రాంట్ గుటుక్కుపై ఎస్పీడీ సీరియస్

కాంప్లెక్స్ నిధుల ఖర్చుపై విచారణకు ఆదేశం

ఎంఈఓలు, హెచ్‌ఎంలతో డీఈఓ, ఏపీసీ కాన్ఫరెన్స్

బిల్లుల వారీగా పరిశీలనకు కమిటీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురంవిద్య, జూలై 17(ఆంధ్రజ్యోతి): స్కూల్ కాంప్లెక్స్ గ్రాంట్ స్వాహాపై సమగ్రశిక్ష రాష్ట్ర సంచాలకుడు (ఎస్పీడీ) శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్కూల్ కాంప్లెక్స్ నిధులను బోగస్ బిల్లులతో స్వాహా చేశారని 'స్కూళ్ల గ్రాంట్ గుటుక్కు' శీర్షికన ఆంధ్రజ్యోతి ఈనెల 13న కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనం సమగ్రశిక్షలో దుమారం రేపింది. దీనిపై ఎస్పీడీ శ్రీనివాసరావు సీరియస్‌గా స్పందించారు. సమగ్రశిక్ష ఏపీసీ శైలజ, జిల్లా విద్యాధికారి ప్రసాద్‌బాబుతో నేరుగా ఆరాతీశారు. స్కూల్ గ్రాంట్, కాంప్లెక్స్ గ్రాంట్‌కు సంబంధించి ఏయే పాఠశాల హెచ్‌ఎం ఎంతఖర్చు పెట్టారు, ఏయే దానికి వెచ్చించారు, బోగస్ బిల్లులు ఎలా పెట్టారు, ఆడిట్‌లో ఎలా ఆమోదం వేశారు తదితర వివరాలతో వారంలోపు నివేదిక ఇవ్వాలని డీఈఓ, ఏపీసీని ఎస్పీడీ ఆదేశించారు. దీంతో గురువారం ఉదయమే జిల్లాలోని అన్నిమండలాల విద్యాధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పాఠశాలలకు వచ్చిన గ్రాంట్ ఎంత, వాటిని దేనికి, ఎంత ఖర్చుపెట్టారు, వాటికి సంబంధించిన బిల్లుల ఓచర్లు అందరూ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. వాటి పరిశీలనకు ఎంఈఓ, హెచ్‌ఎం, ఎంఐఎస్ కోఆర్డినేటర్, సీఆర్‌పీలతో కమిటీ వేస్తున్నామన్నారు. పక్కాగా పరిశీలిస్తుందన్నారు. ఆడిట్ ఇచ్చిన బిల్లుల ప్రకారం తప్పకుండా అన్నీ చూపించాలని కమిటీ పరిశీలించి, నివేదికలు ఇస్తుందని ఏపీసీ శైలజ తెలిపారు. దీంతో కాంప్లెక్స్ పాఠశాలల్లో పనిచేసి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు, ప్రస్తుతం పనిచేస్తున్న వారిలో ఆందోళన మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ గ్రాంట్, కాంప్లెక్స్ గ్రాంట్ ఖర్చుపై విచారణ చేసి, నివేదికలు పంపాలని ఎస్పీడీ మెమో ఇచ్చారని సమగ్ర శిక్ష అధికారి ఒకరు తెలిపారు.

గుజిరీలో ట్రాన్స్‌కో సామగ్రి

విజిలెన్స్ అధికారుల దాడులు

4 టన్నుల వైరు, పరికరాల సీజ్



సీజ్‌చేసిన విద్యుత్ తీగలు, పరికరాలు

తాడిపత్రి, జూలై17(ఆంధ్రజ్యోతి): ఓ గుజిరీ షాపులో ఏకంగా 4 టన్నుల విద్యుత్ తీగలు, పరికరాలు పట్టుబడడం కలకలం రేపింది. పట్టణంలోని అశోక్ పిల్లర్ సమీపాన గల గుజిరీ షాపులో గురువారం విద్యుత్ విజిలెన్స్ అధికారులు, పోలీసులు దాడులు చేశారు. రూ.6 లక్షల విలువైన సామగ్రి పట్టుబడింది. అధికారులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ట్రాన్స్‌కో కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ వైరు, పలురకాల పరికరాలు పట్టణంలోని ఒక గుజిరీ షాపులో ఉన్నట్లు అధికారులకు సమాచారం అందింది. హుటాహుటిన ట్రాన్స్‌కో అధికారులు.. పోలీసులతో కలిసి దాడులు చేశారు. విద్యుత్‌తీగలు, పరికరాలను పెద్దఎత్తున స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో ఏడీఏ ప్రభాకర్ రావు, విజిలెన్స్ అధికారులు నాగభూషణం, ఏఈ రాజారావు పాల్గొన్నారు.

గుజిరీలో నిల్వపై అనుమానాలు

గుజిరీ దుకాణంలో పెద్దఎత్తున విద్యుత్‌వైరు, పరికరాలు ఉండడంపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. కార్యాలయంలో పనిచేసే వారే.. ఈ అక్రమానికి పాల్పడి ఉంటారా అన్న కోణంలో విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారని తెలుస్తోంది. విద్యుత్ సామగ్రి కార్యాలయం నుంచి తరలించినా.. సంబంధిత అధికారులు ఫిర్యాదు చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నామినేటెడ్ సంబరం

ఆరు మార్కెట్ యార్డు కమిటీలకు చైర్మన్ల నియామకం



అనసూయ



సూర్యప్రతాప్



రామకృష్ణప్ప



శైలజ



చంద్రకళ



శివప్రసాద్

పుట్టపర్తి/అనంతపురం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో నలుగురు టీడీపీ, ఇద్దరు జనసేన నాయకులకు నామినేటెడ్ పదవులు దక్కాయి. మార్కెట్ యార్డు కమిటీలకు వీరిని చైర్మన్‌లుగా ప్రభుత్వం నియమించింది. గుత్తి మార్కెట్ యార్డు చైర్మన్‌గా సూర్యప్రతాప్(టీడీపీ), పెనుకొండకు బొక్సంపల్లి రామకృష్ణ చౌదరి(టీడీపీ), గోరంట్ల యార్డుకు సోమందేపల్లికి చెందిన నడిమిపల్లి ఈ. శైలజ వెంకటేష్(టీడీపీ), తనకల్లు యార్డుకు తులిసేనాయక్ తండాకు చెందిన బుక్కే చంద్రకళ (టీడీపీ), కదిరికి ఎన్‌పీ కుంట మండలం తిమ్మమ్మమర్రిమానుకు చెందిన ఎం.అనసూయ(జనసేన), పుట్టపర్తి మార్కెట్ యార్డుకు జనసేన కొత్తచెరువు మండల కన్వీనర్ పూల శివప్రసాద్‌ను నియమించారు. టీడీపీ, జనసేనలో పార్టీ విధేయులకు పట్టం కట్టారు. కూటమి పార్టీల్లో జనసేనకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారు.

మోసం కేసులో బిల్ కలెక్టర్ అరెస్టు

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఓ యువతిని మోసగించిన ఘటనలో బిల్ కలెక్టర్ శివప్రసాద్‌ను దిశ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. దిశ డీఎస్పీ మహబూబ్‌బాషా తెలిపిన మేరకు బిల్ కలెక్టర్ ఇదివరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. అయితే తన బంధువైన ఓ యువతితో గత మూడేళ్లుగా సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆమెపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇటీవల ఆమె పెళ్లి ప్రస్తావన తేవడంతో తిరస్కరించాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించారు. ఆమె ఫిర్యాదు మేరకు దిశ పోలీసులు కేసు నమోదు చేసి, బిల్ కలెక్టర్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

అమరాపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం పరిధిలోని చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. ఎస్ఐ ఇషాక్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెరువులో శవం తేలియాడుతుండడాన్ని అటుగా వెళ్లిన వారు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఇషాక్ బాషా ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మృతుడి వయసు 45 ఏళ్లు ఉండవచ్చనీ, ఏడెనిమిది రోజుల క్రితం మృతిచెంది ఉండవచ్చన్నారు. శవం పూర్తిగా కుళ్లిపోవడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. అతడి సంబంధికులు 9441825793 నంబరులో సంప్రదించాలన్నారు.

పలు ప్రాంతాల్లో చిరుజల్లులు

అనంతపురం అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం చిరు జల్లులు పడ్డాయి. అనంతపురం, బొమ్మనహాళ్, యాడికి, పెద్దవడుగూరు, ఉరవకొండ, గుత్తి తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమైనా వర్షం పడలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

పగలే చోరీలు

మడకశిర టౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పగలే దొంగలు చోరీలకు తెగబడ్డారు. పావగడ రోడ్డులో గురువారం రెండు ఇళ్లలో చోరీ చేశారు. కొలిమి నాగేంద్ర ఇంటితోపాటు పక్కనే ఉన్న మరో ఇంటి మేడపై ఉన్న శకుంతల ఇంట్లో దొంగలు పడ్డారు. కొలిమి నాగేంద్ర ఉదయం 11 గంటలకు బ్యాంకు పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసుకుని, వెళ్లాడు. దీనిని అదునుగా భావించిన దొంగలు ఇంటి తాళం ధ్వంసం చేసి, లోపలికి చొరబడ్డారు. బీరువా తాళాలు పగులకొట్టి అందులోని రూ.70 వేలు నగదు, జత బంగారు కమ్మలు, ఉంగరం అపహరించారు. నాగేంద్ర ఇంటికిరాగా.. తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికెళ్లి చూడగా.. బీరువా తాళాలు పగులకొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జత బంగారు కమ్మలు, ఒక ఉంగరం చోరీ అయినట్లు బాధితులు తెలిపారు. సమీపంలోనే మేడపై ఉంటున్న శకుంతల పెనుకొండ కియ ఫ్యాక్టరీలో పనికెళ్తుంది. ఆమె ఫ్యాక్టరీకి వెళ్లగా దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని బంగారు నగలు అపహరించారు. సమాచారం అందుకున్న సీఐ నాగేష్ బాబు.. సిబ్బందితో అక్కడికి చేరుకుని, రెండు ఇళ్లలో పరిశీలించారు. క్లూస్ టీమ్‌తో వేలిముద్రలు సేకరించారు. పగలే, అది కూడా ప్రధాన రహదారి పక్కనే ఉనన ఇళ్లలో చోరీలు జరగడంతో పట్టణంలో కలకలం రేగింది. చోరీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలిక అదృశ్యం



నల్లక్క

బెళుగుప్ప, జూలై17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన బాలిక నల్లక్క కనిపించకుండా పోయింది. ఎస్ఐ శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లక్క పదో తరగతి వరకు చదువుకుంది. ఇంటి వద్దే ఉంటుండేది. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటికెళ్లిన నల్లక్క తిరిగిరాలేదు. కుటుంబీకులు.. బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఓబుళమ్మ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు.

అనంత క్రికెటర్ల హవా

ఆంధ్రా అండర్-23 జట్టు ప్రాబబుల్స్‌లో ఆరుగురికి చోటు



అర్జున్ టెండూల్కర్



మల్లికార్జున



కమిల్



దీపక్



మహేంద్రరెడ్డి



దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై17(ఆంధ్రజ్యోతి): అనంత క్రికెటర్లు అదరగొడుతున్నారు. ఆంధ్రా అండర్-23 క్రికెట్ జట్టులో ఏకంగా ఆరుగురు జిల్లా క్రికెటర్లు చోటు దక్కించుకున్నారు. అర్జున్ టెండూల్కర్, మల్లికార్జున, కమిల్, దీపక్, మహేంద్రరెడ్డి, దత్తారెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు. శుక్రవారం నుంచి విజయనగరంలో నిర్వహించే వన్డే మ్యాచ్‌లకు వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. జట్టు కోచ్‌గా జిల్లాకే చెందిన నరేష్ ఎంపికయ్యాడు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ అండ: ఎంపీ అంబికా

రూ.10.06 లక్షల చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం క్రైం, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైద్యం కోసం లక్షలు వెచ్చించి, ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్న వారికి సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎంపీ గురువారం పంపిణీ చేశారు. వనజ, జయమ్మ, మహమ్మద్ గౌస్, తలారి మణికంఠ, శ్రీరామ్‌రెడ్డి, మమతకు రూ.10.06 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఎంపీ అంబికా మాట్లాడుతూ... జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించినపుడు ప్రజల సమస్యలను విని, సీఎం సహాయనిధి ద్వారా సాయం చేస్తానని హామీ ఇచ్చానన్నారు. దానిని నెరవేర్చడం ఆనందంగా ఉందన్నారు.

యువతికి వేధింపులు.. కేసు నమోదు

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ కాలనీకి చెందిన ఓ యువతిని వేధించిన యువకుడిపై కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ రెడ్డప్ప గురువారం తెలిపారు. సీఐ తెలిపిన మేరకు, బాధిత యువతి బీటెక్ పూర్తి చేసి, జావా కోర్సు చేసేందుకు నాలుగు నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ హాస్టల్‌లో ఉంటూ కోర్సు చేస్తోంది. రెండు నెలల క్రితం స్నేహితురాలి పుట్టిన రోజు వేడుకల్లో ఆమెకు ధర్మవరం మండలం తుంపర్తికి చెందిన ప్రణవ్‌తో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇద్దరూ ఫోన్‌లో మాట్లాడుకునేవారు. ఈ క్రమంలో కోచింగ్‌కు వెళ్లే సమయంలో ప్రణవ్ వెంటపడుతూ అసభ్యకరంగా ప్రవర్తించడం ప్రారంభించాడు. తన కోరిక తీర్చాలని వేధించేవాడు. ఇష్టం లేదని చెప్పినా వినుకోలేదు. ఈ క్రమంలో వారం క్రితం బాధిత యువతి ధర్మవరానికి వచ్చింది. అయినా ప్రణవ్ బెదిరించడం మానుకోలేదు. ఫోన్ చేసి, ఫొటోలను అసభ్యంగా తయారు చేసి బంధుమిత్రులకు పంపుతానని బాధితురాలిని బెదిరించాడు. మాట వినకపోతే చంపుతానని హెచ్చరించాడు. ఈ విషయాన్ని బాధిత యువతి తన తల్లిదండ్రులకు చెప్పి, టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

జూనియర్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతి

అనంతపురం న్యూటౌన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ సర్కిల్ పరిధిలోని పలువురు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఎస్ఈ మహేశ్వరరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌హెచ్ సర్కిల్ అనంతపురంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న రాజశేఖర్‌రెడ్డికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఆర్అండ్‌బీ ఎన్‌హెచ్ అనంతపురం డివిజన్‌కు, ఆర్అండ్‌బీ అనంతపురం సర్కిల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గ ఉన్న ఎస్తేర్‌రాణిని కళ్యాణదుర్గానికి, నంద్యాల డివిజన్‌లో టైపిస్టుగా పనిచేస్తున్న మదన్‌కుమార్‌ను కర్నూలుకు, కోయిలకుంట్ల నుంచి కిరణ్‌కుమార్‌ను రాయదుర్గం సబ్‌డివిజన్‌కు బదిలీ చేశారు.

20న బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా జూనియర్ బాలబాలికల బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 20వ తేదీన స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి గురువారం ప్రకటనలో తెలిపారు. 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు ఆగస్టు 14వ తేదీ నుంచి తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. ఆసక్తి, అర్హత గల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, యూనిఫాం, క్రీడాసామగ్రితో సెలెక్షన్స్‌కు హాజరుకావాలన్నారు. వివరాలకు 9393711324 నంబరులో సంప్రదించాలని కోరారు.

న్యూస్ బాక్స్

శివాలయంలో మండల పూజ



హోమం చేస్తున్న వేదపండితులు

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షిర్డీసాయి బాబా ఆలయ ఆవరణంలో నూతనంగా నిర్మించిన శివాలయం మండలపూజను గురువారం ఘనంగా నిర్వహించారు. నూతనంగా నిర్మించిన శివాలయంలో లింగ ప్రతిష్ఠ చేసి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదుట హోమాలు నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

●రూ.30లక్షల విలువైన ఎరువుల అమ్మకాల నిలిపివేత

బత్తలపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ సీఐ శివన్న, వ్యవసాయాధికారులు శివకుమార్, ప్రసాద్ గురువారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు పరిశీలించారు. రిజిస్టర్‌లలో ఉన్న స్టాక్‌కు కంటే అధికం గా దుకాణాల్లో నిల్వలు ఉండడంతో రూ. 30లక్షలకు పైగా విలువై న ఎరువుల అమ్మకాలు నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అయితే తనిఖీ చేసేందుకు వచ్చామని తెలిసి పలువురు యజమా నులు వారి దుకాణాలను బంద్ చేశారని, అలాంటివారిపై చర్యలు తప్పవని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఓబిరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కదిరి అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరవాం డ్లపల్లి పంచాయతీలో ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రంలో పారిశుధ్య కార్మికులుగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పోలప్ప గురువారం ప్రకటనలో తెలిపారు. నెలకు రూ.6వేల గౌరవ వేతనంతో పాటు ప్రత్యేక అలవెన్స్ కింద రూ. వెయ్యి ఇస్తామన్నారు. 18నుంచి 55 సంవత్సరాలలోపు పురుషులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో వ్యవసాయ భూములను ప్రైవేటు కార్పొరేట్ విద్యుత్ కంపెనీలకు ఇస్తున్న ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ నంద్యాలలో ఈనెల 27న జరిగే రాష్ట్రస్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన, జిల్లా ఉపాధ్యక్షుడు మారుతి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రైతు సంఘం కార్యాలయం వద్ద గురువారం రాష్ట్ర సదస్సుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

మాదిగ ఉద్యోగుల సమావేశాన్ని...

కదిరి అర్బన్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ గురువారం ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 20న మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భాక్తాలు పెనుకొండలో సమావేశం నిర్వస్తున్నారని తెలిపారు. జిల్లాలోని అన్నిశాఖల్లో పనిచేస్తున్న మాదిగ ఉద్యోగులు, సమావేశానికి హాజరుకావాలని కోరారు.

శక్తి యాప్‌పై అవగాహన: ఎస్ఐ

నంబులపూలకుంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు శక్తి యాప్‌పై ఎస్ఐ వలీబాషా అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, మావన అక్రమరవాణాపై తెలియజేశారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై బాలికలకు వివరించారు. అత్యవసర సమయాల్లో 100, 1098, 112 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. పోలీసులు మంజుల, తాజుద్దీన్, చలపతి, హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అనుమానితుల ఇళ్లలో పోలీసుల తనిఖీలు

ఓబుళదేవరచెరువు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శివారు ప్రాంతాల్లో ఉన్న అనుమానితుల ఇళ్లల్లో గురువారం సీఐ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తనిఖీలు చేశారు. పాత కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న వారి ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. ఆ ప్రాంతవాసులతో సమావేశం నిర్వహించారు. చట్టాలు, రోడ్డు ప్రమాదాలు, డయల్ 100 గురించి వివరించారు. ఏఎస్ఐ వెంకటరాముడు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నంబులపూలకుంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం గ్రామంలో వినోద్‌కుమార్‌నాయక్ (30) అనే వ్యక్తి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాలపురానికి చెందిన వినోద్‌కుమార్‌నాయక్ ఊజీమాత్రలు మింగి గ్రామ సమీపంలో ఓచెట్టు వద్ద అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు గ్రామస్థులు గుర్తించారు. అతడిని 108 వాహనం ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

భూ తగాదాలో ఇద్దరిపై కేసు

ముదిగుబ్బ, జూలై 17(ఆంధ్రజ్యోతి): తనకు దొరిగల్లు రెవెన్యూ పొలంలోని సర్వే నంబర్ 1352-3లోని ఎకరా 15 సెంట్ల భూమిలో షెడ్డు వేస్తుండగా మండల కేంద్రానికి చెందిన కృష్ణం సూర్యనారాయణ, కృష్ణం రెడ్డిరాజు అడ్డుకుని బెదిరించారని మండల కేంద్రానికి చెందిన నామా రాంప్రసాద్ ఫిర్యాదు చేసినట్లు ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపారు. ఈ మేరకు గురువారం సూర్యనారాయణ, రెడ్డిరాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలి'

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నాయకత్వ లక్షణాలను అలవరచుకోవాలని రిషి విద్యాలయ పాఠశాల ప్రిన్సిపాల్ కరణ్‌స్వరూపాసింగ్, డీఎస్ బాస్కర్ పేర్కొన్నారు. పట్టణంలోని రిషి విద్యాలయంలో విద్యార్థుల ప్రతినిధుల ఎన్నికలు ఉత్సాహభరితంగా గురువారం జరిగాయి. ఈ ఎన్నికలలో విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్, డీన్ మాట్లాడుతూ...పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత ఆలోచనలు అలవరచుకుంటారని అన్నారు. కార్యక్రమంలో సీఏఓ రవీంద్ర, వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి, ఏఓ రంగారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేని కలిసిన సొసైటీ అధ్యక్షుడు

కదిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పెద్దకడపలవారిపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన బడా రాజారెడ్డి, డైరెక్టర్లు ఉత్తన్ననాయక్, లక్ష్మణ తదితరులు గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను పట్టణంలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయనను పూలమాలలు, దుశ్శాలు వతో సన్మానించారు. ఈ సదర్భంగా బడా రాజారెడ్డి మాట్లాడుతూ.. తమ మీద నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ టీడీపీ సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, శంకర్ నాయుడు, సోంపాళ్యం నాగభూషణం, నాగేంద్ర, గోవిందు, మల్లికార్జున, రమణయ్య, రవి, హరినాయక్, బ్రహ్మానందరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణం, శివరాం, ఇస్మాయిల్, కోటిరెడ్డి, శ్రీరాములునాయక్ పాల్గొన్నారు.

వామ్మో శునకాలు..!

● వార్డుల్లో విచ్చలవిడిగా వీధి కుక్కలు
● వాటి దాడితో పలువురు ఆస్పత్రుల పాలు
● బెంబేలెత్తుతున్న పట్టణవాసులు
● పాదయాత్రలో మంత్రికి ఫిర్యాదు



సిద్దయ్యగుట్టలో సంచరిస్తున్న వీధికుక్కలు

ధర్మవరం, జూలై 17 (ఆంధ్రజ్యోతి): శునకాల స్వైర విహారం పట్టణవాసులను బెంబేలెత్తిస్తోంది. ఏ వార్డులో చూసినా గుంపులుగుంపులుగా సం చరిస్తూ ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇప్పటికే చాలా మంది కుక్కలు దాడిచేయడంతో ఆస్పత్రుల పాలైన సంఘటనలు ఉన్నాయి. కొన్నినెలలుగా కుక్కలు పట్ట పగలే దాడులు చేస్తున్నా అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవ హరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోజూ తమ పిల్లలను స్కూళ్లకు వదిలి పిలుచుకురావాలన్నా భయంగా ఉందంటున్నారు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం కనిపించలేదని వాపోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల పట్టణంలో మూడురోజులు పాదయాత్ర చేపట్టిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లి, పరిస్థితి వివరించారు.

విచ్చలవిడిగా వీధికుక్కలు: మున్సిపాలిటీలో 40 వార్డులు ఉన్నాయి. చాలా వార్డుల్లో కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి. పట్టణంలో మొత్తం మూడు వేలకు పైగా ఉన్నట్టు సంబంధిత పశువైద్యశాఖ సిబ్బంది పేర్కొంటున్నారు. ఏ మాత్రం ఏ మరపాటుగా ఉన్న వెంటనే మనుషులపై దాడులకు దిగుతున్నాయి. ముఖ్యంగా చాలా వరకు పిల్లలపై దాడులు చేసి గాయపరచిన సంఘటనలు ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లే పిల్లలతో పాటు ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారులను కరుస్తుండటంతో చాలామంది గాయపడి ఆస్పత్రులకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఆర్నెల్లలో 762 మంది కుక్కల దాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సలకు వచ్చినట్టు వైద్యులు పేర్కొంటున్నారు.

మంత్రి సత్యకుమార్ ఆదేశాలు: వీధి కుక్కల బెడదతో తీవ్ర ఇబ్బంది లుపడాల్సి వస్తోందని ఇటీవల పట్టణంలో మూడురోజులపాటు పాదయాత్ర చేపట్టిన మంత్రి సత్యకుమార్ దృష్టికి ప్రజలు తీసుకెళ్లారు. స్పం దించిన మంత్రి వెంటనే కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సెంటర్‌ను సందర్శించారు. వీధికుక్కల నియంత్రణలో భాగంగా వ్యాక్సి నేషన్ డ్రైవ్‌లను వేగవంతం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

నియంత్రణ చర్యలు చేపడతాం

పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపడుతాం. గతంలో కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసేందుకు పశువైద్యాధికారులు వచ్చేవారు. అయితే ప్రస్తుతం రాయలసీమకు కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడానికి డీఎం ఆఫీసు నుంచి ఇద్దరు డాక్టర్‌లకే అనుమతులు ఇచ్చారు. వీరిలో ఒక డాక్టర్ దూరమని ధర్మవరానికి రాలేదని మరో డాక్టర్ ఇటీవల వచ్చి ఆపరేషన్ చేయడానికి ఏ విధమైన చర్యలు తీసుకోవాలో సలహాలు, సూచనలు ఇచ్చి వెళ్లారు. ఆయన సూచించిన విధంగా ఏర్పాట్లను చేసి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

\- శామ్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

రాష్ట్రానికి సంపద సృష్టికర్త చంద్రబాబు

: ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



మిట్టపల్లిలో కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, జూలై 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపించడంతో పాటు, సంపద సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆమె గురువారం మిట్టపల్లి పంచాయతీలోని వనుకువారిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ... ఐదేళ్ల వైసీపీ పాలనలో రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తిగా నాశనం చేశారన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా సర్వనాశనం చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారం చేపట్టగానే రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నికల మునుపు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని తెలిపారు.

ఉపాధ్యాయురాలిగా మారిన ఎమ్మెల్యే

మండలంలోని మిట్టపల్లి ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఉపాధ్యాయురాలిగా మారారు. పలు పాఠ్యాంశాలను విద్యార్థులకు బోధించారు. నాణ్యమైన విద్య, మధ్యాహ్నం భోజనం గురించి విద్యార్థులతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు తుమ్మల మహబూబ్‌బాషా, బోయపల్లి శివారెడ్డి, మండల మాజీ కన్వీనర్ రాజారెడ్డి, పీట్ల సుధాకర్, బూదిలి ఓబులరెడ్డి, కల్యాణి, జెరిపిటి ఆంజనప్ప, మునాఫ్, నిజాం, ఆర్ఎంపీ జాకీర్, కొత్త సుధాకర్ రెడ్డి, కంచి సురేష్, గంటా శ్రీనివాసులు, మండోజీ ఆర్ఫీఖాన్, కుమార్, రాయల్, సుబాషినీ, నాగవేణి, మస్తానమ్మ పాల్గొన్నారు.



● ధర్మవరం: అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ 26వ వార్డు నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని నాయకులు టైలర్ గోపాల్, బూత్ కన్వీనర్లు ఉపేంద్ర, చంద్రాయుడు, సల్మా, కో కన్వీనర్ నరసింహులు, అనిల్‌కుమార్ గురువారం పట్టణంలోని 26వ వార్డులో నిర్వహించారు.



● నంబులపూలకుంట: మండలంలోని ఎగువ తూపల్లిలో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు రమణారెడ్డి, బూత్ కన్వీనర్ జయచంద్ర, రెడ్డెప్ప, జయచంద్రారెడ్డి, సుధాకర్‌నా యుడు, మధు, అప్పల, వేమయ్య, క్రిష్ణ, లింగమూర్తి, చంద్ర, నాగభూషణ, సూరి తదితరులు పాల్గొన్నారు.



● నల్లమాడ: మండలంలోని బండవాండ్లపల్లి, నల్లమాడ ఎస్సీ కాలనీలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీమండల కన్వీనర్ మైలే శివశంకర్, కోట్లో మంజునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంచారు. వారితో పాటు శ్రీరాములు, నరసింహులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తో జాగ్రత్త..!

● చెల్లి అంటే.. ఆ కుటుంబానికి హాని తప్పదేమో
● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



33వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కదిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): 'నా చెల్లి' అని ఏ మహిళనైనా మా జీ సీఎం జగన్ అన్నాడంటే ఆ కుటుంబ సభ్యు లు జాగ్రత్తగా ఉండాలని, గతంలో ఆయన అలా అన్నవారి కుటుంబాల్లో హత్యలు, మోసాలు జరి గాయని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మీకు అలాంటివి జరగ కుండా జాగ్రత్తగా ఉండాలని కృష్ణా జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ హారి కను హెచ్చరించారు. ఎమ్మెల్యే గురువారం సుపరిపాలన తొలిఅడుగులో భాగంగా మున్సిపాలిటీలోని 33వార్డులో ఇంటింటా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగన్ తీరుతో వరుసకు చెల్లెలు అయిన నర్రెడ్డి సునీత, సొంత చెల్లి షర్మిల రోడ్డు జగన్ తీరుతో ఎక్కారన్నారు. జగన్ చెల్లి అంటే అనుమానించా ల్సిందే అన్నారు. ఏమి విత్తితే అదే పండుతుందని చెబుతున్న జగన్మోహన్‌రెడ్డి... టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే విత్తుతోందని, అదే పండుతుందన్నారు. అవే తమకు శ్రీరామరక్ష అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ కులాలను, మతాలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. మీ ప్రభుత్వంలో స్వేచ్ఛ ఎప్పుడూ లేదని, మా ప్రభుత్వ ఇచ్చే స్వేచ్ఛనైనా కాలరాయకుండా వాడుకోవాలని సూచించారు. జగన్ పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. తనపై 23 కేసులు పెట్టారని అయినా తాను భయపడలేదన్నారు. మీరేమో పీఆర్‌కోడ్ నొక్కి వ్యతిరేకత చాటాలని పిలుపునిస్తే, సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ప్రజలు తనకు ఇంటింటా హారతులు పడుతున్నారని అన్నారు. మీరు రాష్ట్రాభివృద్ధిని కోరుకుంటూ ఉంటే ప్రజలకు క్షమాపణ చెప్పి, వారి వద్దకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, వైస్ చైర్మన్ రాజశేఖరాచారి, నాయకులు బాహుద్దీన్, బాబాయ్య, రమణ నాయుడు, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

శ్మశానాన్నీ వదలరా?

గాండ్లపెంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటికను కూడా వదలరా? అని మండలంలోని కటారుపల్లి పంచాయతీ కటారుపల్లి క్రాస్ గ్రామస్థులు తహసీల్దార్ బాబురావును అని ప్రశ్నించారు. శ్మశాన వాటిక సమస్యపై వారు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిశారు. తమ పూర్వికుల నుంచి గ్రామం లోని సర్వే నెంబర్ 477/1లో అంత్యక్రియలు చేస్తున్నామన్నారు. ఇటీవల కస్తూర్బా మోడల్ స్కూల్‌కు అదనపు గదుల నిర్మాణం కోసం శ్మశానవాటిక వద్ద స్థలాన్ని చదువు చేశారన్నారు. తహసీల్దార్ మాట్లాడతూ... పాఠశాల నిర్మాణానికి 2009లో రెవెన్యూ అధికారులు పట్టా ఇచ్చారని, ఈ విషయంపై తాను ఏమీ చేయలేనన్నారు. అనంతరం గ్రామస్థులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ వద్దకు వెళ్లి విన్నవించారు. వెంటనే ఎమ్మెల్యే తహసీల్దార్‌కు ఫోన్ చేసి, అక్కడ పాఠశాల నిర్మాణం చేపట్టవద్దని ఆదేశించారు. గ్రామస్థులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామసులు నరసింహులు, సూరి, నాగ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ



ధర్మవరంలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ సాయిమనోహర్

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్): గ్రామ పంచాయతీల స మగ్ర అభివృద్ధి దిశగా సిబ్బంది పనిచేయాలని ఎంపీడీఓ సాయి మనోహర్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం పంచాయతీల అభివృద్ధి సూచిక-2.0పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజి నీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశాన్ని నిర్వ హించి, పలు అంశాలపై వివరించారు. అలాగే నంబులపూలకుంట, గాండ్లపెంట, నల్లచెరువు, ఓబుళదేవరచెరువు ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆయా ఎంపీడీఓల ఆధ్వర్యంలో పంచాయతీల పురోభివృద్ధిపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డుపై మడుగు



లోచర్ల సచివాలయం ఎదుట పెనుకొండ రహదారిపై ఇలా...

కొత్తచెరువు, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి లోచర్ల మీదుగా పెనుకొండకు వెళ్లే ప్రధానరహదారిపై వర్షపు నీరు నిలబడడంతో మడుగును తలపిస్తోంది. లోచర్ల సమీపంలోని సచివాలయం ఎదుట చిన్నపాటి వర్షానికే వర్షపునీరు నిలుస్తుండటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. కొందరు ప్రమాదాలకు గురవుతున్నట్టు స్థానికులు పేర్కొంటున్నారు. మరి కొందరు రోడ్డుపై ఏమైనా మడుగు ఉందా అన్న భయంతో వాహనాలను రోడ్డుకు పక్క వైపు నుంచి వెళ్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు ఈ విషయాన్ని పలుమార్లు తెలిపినా వారు పట్టించుకోలేదని ఆ గ్రామ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్లపై మురుగు నీటి ప్రవాహం

●గాండ్లపెంట: మండలకేంద్రంలోని క్వార్టర్సులో రోడ్లపై మురుగునీరు పారుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. గాండ్లపెంట క్వార్టర్సు వీధిలోని పలువురు నివాసాల నుంచి వదులుతున్న మురుగునీరు రోడ్లపై పారుతుండడంతో అపరిశుభ్రత నెలకొందన్నారు. ఆ నీరు క్వార్టర్సు నుంచి జీన్లకుంట పాత మసీదు వరకు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వాపోయారు. పలుమార్లు పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లపై మురుగునీరు పారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



క్వార్టర్స్ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

దొంగలు మకాం వేశారా?

గాండ్లపెంట, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో దొంగలు మకాం వేశారా? అనేది గ్రామస్థులకు చర్చనీయాంశంగా మారింది. నాలుగురోజుల క్రితం వరుస చోరీలు జరిగాయి. పలు ఇళ్లు, దుకాణాల్లో దొంగతనాలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ప్రతిరోజు రాత్రి సమయంలో వీధుల్లో దొంగలు సంచరిస్తున్నట్లు గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండురోజుల క్రితం ఓ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా యజమాని గమనించి కేకలు వేయడంలో దొంగలు పారిపోయినట్లు గ్రామ స్థులు చెబుతున్నారు. సోమవారం రాత్రి మల్లమీదపల్లి రోడ్డు సమీ పంలో ఓ ప్రైవేటు బస్సు అద్దాలు పగలగొట్టి అందులోని వస్తువు లు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించారని, ప్రజలు గమనించడంతో పారిపోయినట్లు చెబుతున్నారు. ఈ విషయంపై పోలీసులకు సమచారం అందించినట్లు ప్రజలు అంటున్నారు. ప్రతిరోజు శివారు ప్రాంతాల్లోని నివాసాల వద్ద కొత్త వ్యక్తులు సంచరిస్తున్నారని, దీంతో మండలకేంద్రంలో దొంగలు మకాం వేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చోరీ వెనుక గతంలో చేసినవారే ఉంటారని దీనిపై పోలీసులు నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ

కదిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ఇటీవల సబ్‌డివిజన్‌లో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడానికి పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. ఆయన గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మధ్యప్రదేశ్‌కు చెందిన చెడ్డీగ్యాంగ్, నంద్యాలకు చెందిన చెంచుగ్యాంగ్ దొంగత నాలకు పాల్పడుతోందన్నారు. వారిని ఇప్పటికే గుర్తించామన్నారు. రాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు దొంగతనాలు చేస్తారని, విశాలమైన పెద్ద ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటారన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఊర్లకు వెళ్లేటప్పుడు విలువైన వస్తువులను లాకర్‌లో పెట్టి వెళ్లాలన్నారు. పక్కింటివారికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాట్సప్‌లో స్టేటస్ అందరికి కనిపించేలా పెట్టుకోకూడదని, తద్వారా మీరు ఎక్కడున్నది దొంగలకు సమాచారం వెళ్తుందన్నారు. అనంతరం ట్రాఫిక్ నియంత్రణ కోసం వచ్చిన మూడు ద్విచక్రవాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ సమావేశంలో ట్రైనీ డీఎస్పీ ఉదయపావని, సీఐ నారాయణరెడ్డి, ఎస్ఐ బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఆర్డీఓ



సైబర్ సెక్యూరిటీ బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న ఆర్డీఓ సువర్ణ

పుట్టపర్తి రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో విధులు నిర్వర్తించే ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఉద్యో గాన్ని పనిగా కాకుండా సేవగా భావించాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. జిల్లా కేంద్రంలోని స్త్రీశక్తిభవన్‌లో గురువారం చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్, మిషన్‌వాత్సల్య, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆర్డీఓ సువర్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ... ఆరోగ్యం యొక్క ప్రాధాన్యం, లైంగిక పునరుత్పత్తి హక్కులపై వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు, కౌమారదశలో ఉన్న చిన్నారులను సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై ప్రోత్సహించాలని, ప్రతిబిడ్డకు సురక్షితమైన ఆరోగ్యాన్ని అందించాలని ఆర్డీఓ ప్రజలకు సూచించారు. అనంతరం డిజిటల్, సైబర్ భద్రతపై బుక్‌లెట్‌ను ఇతర ఆహూతులతో కలసి విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, డీసీపీఓ మహేష్, వైద్యసిబ్బంది చంద్రానాయక్, సుశీలమ్మ, డిప్యూటీ హెచ్ఓలు రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు, సోసియల్ వర్కర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పాత మున్సిపల్ గెస్ట్‌హౌస్ ప్రాంగణం పరిశీలన

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దయ్యగుట్టలో ఉన్న పాత మున్సిపల్ గెస్ట్ హౌస్ ప్రాంగణాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ గురువారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ... ఆ గెస్ట్ హౌస్ ప్రాంగణం నుంచి విషసర్పాలు ఇళ్ల వద్దకు వస్తున్నా యని ఇటీవల పాదయాత్ర నిర్వహించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు స్థానిక ప్రజలు వినతిపత్రం ద్వారా తెలియజేశారు. దీంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, శుభ్రం చేయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఆ ప్రదేశాన్ని చిన్న పార్క్‌గా అబివృద్ధి చేయాలని హరీశ్‌బాబు అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకాచంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, నాయకులు ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

'కార్మికులకు రోజువారీ వేతనం పెంచాలి'

ధర్మవరం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పనిచేస్తున్న రెగ్యులర్ పారిశుధ్య కార్మికులకు రోజు వారి వేతనం రూ.400 నుంచి రూ.600కు పెంచాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ డిమాండ్‌చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కరోనా సమయంలో పారిశుధ్య కార్మికులుగా 87 మందిని మున్సి పాలిటీ పరిధిలో విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. ఇప్పటి వరకు వారికి కనీస వేతనం అమ లు చేయలేదన్నారు. కనీస వేతనం కోసం ఏడాదిన్నర నుంచి అధికారులకు, ప్రజాప్రతినిదులకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఎవరూ పట్టించుకోక పోవడంతో శుక్రవారం నుంచి నిరధిక సమ్మెకు సీఐటీయూ పిలుపునిచ్చిందన్నారు. అలాగే 22రోజులుగా సమ్మె చేస్తున్న ఇంజనీ రింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

విద్యార్థులకు అట్టల పంపిణీ

కదిరి, జూలై 17(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రంలోని ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు గురువారం పెయింట్ దుకాణం యజమాని మహేష్ పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. తమ పెయింట్ దుకాణం మూడేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సామాజిక బాధ్యతగా ఆరో రతగతి చదువుతున్న విద్యార్థులకు అట్టలు పంపిణీచేశామని ఆయన తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ వెంకటేష్, కోచ్ భార్గవ్

ధర్మవరం రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరు వద్ద ఉన్న నైరా ఎరుడైట్ ఈఎం పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ శ్వేత, ప్రిన్సిపాల్ వెంకటేష్ గురువారం తెలిపారు. విద్యార్థులు చార్విక్‌దేవ్, గగన్‌దీప్ (అండర్-11), ఫణిబాబు, నందకిషోర్ (అండర్-14), లోచన్ (అండర్-17) విభాగాల్లో ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈ నెల 19, 20తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌తో పాటు కోచ్ భార్గవ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఆక్రమణల తొలగింపు


ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

గోరంట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ కూడలి నుంచి రావికుంట చెరువు కట్టవరకు సీసీ రోడ్డు ఏర్పాటుకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను పోలీసులు, టీడీపీ నాయకుల సమక్షంలో ఎక్స్‌కావేటర్ ద్వారా గురువారం తొలగించారు. గతంలో గోరంట్ల నుంచి చాగలేరు మీదుగా కొడికొండవరకు డబుల్‌రోడ్డు పనులు చేపట్టారు. గోరంట్ల పట్టణంలో రోడ్డు ఏర్పాటు విషయంలో వివాదం తలెత్తడంతో అప్పటి వైసీపీ నాయకులు పనులను అర్ధంతరంగా నిలిపివేశారు. అయితే మంత్రి సవిత ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు పనులు పునఃప్రారంభమయ్యాయి. చెరువు కట్ట సమీపంలో రెండు నివాసాలకు సంబంధించిన మెట్లు అడ్డురావడంతో వాటిని అధికారులు ఎక్స్‌కావేటర్ ద్వారా తొలగించారు.

మాజీ ఎంపీ నిమ్మల ఆగ్రహం

ఆక్రమణల తొలగింపు సందర్భంగా తన స్థలంలోని దశాబ్దాల కాలంనాటి కొబ్బరిచెట్టును తొలగించారని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి తాను వ్యతిరేకం కాదని, గతంలోనే 40 అడుగులు రోడ్డుగా నిర్ణయించగా, ప్రస్తుతం తాను లేని సమయంలో నోటీసు ఇవ్వకుండానే చెట్టు తొలగించడం దారుణమన్నారు. చట్టపరమైన చర్యల కోసం కోర్టును ఆశ్రయిస్తామని నిమ్మల తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలి..

కేంద్ర పంచాయతీ బృందం సభ్యులు

లేపాక్షి, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజల కోసం ఏర్పాటుచేసిన సౌకర్యాలను కేంద్ర పంచాయతీ బృందం సభ్యులు గురువారం మండల కేంద్రంలో పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ, ఆయుర్వేద ఆసుపత్రి, దుర్గావీరభద్ర స్వామి ఆలయ ప్రాంతాల్లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటుచేసిన మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రఖ్యాతిగాంచిన దేవాలయం వద్ద మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకొచ్చి భక్తులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు రామాంజినేయులు, అనంతకుమార్, నరసింహమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే సోలార్ ప్రాజెక్టు

చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధి రవీంద్ర


అంగీకార పత్రాలు అందజేస్తున్న రైతులు

మడకశిర రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): రైతుల అంగీకారంతోనే సోలార్ ప్రాజెక్టు ఏర్పాటవుతుందని చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధి రవీంద్ర అన్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో గురువారం హరేసముద్రం పంచాయతీ కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామన్నారు. భూముల విషయంలో ఏవైనా అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్ట్‌కు భూములు ఇచ్చే రైతులకు ఎకరాకు సంవత్సరానికి రూ.31 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. భూములు ఇచ్చే రైతులు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, తాజా 1బి, అడంగల్ పత్రాలను రెవెన్యూ అధికారులకు ఇవ్వాలని సూచించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కృషితో ఈ ప్రాజెక్టు రావడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 25 మంది రైతులు అంగీకార పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హరీష్, వీఆర్ఓ ధర్మేంద్ర, సర్పంచ్ కరియణ్ణ, రైతులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో కుంటుపడిన అభివృద్ధి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేసామి


పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జూలై17(ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేసామి అన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీలోకి చేరే వారి సంఖ్య అధికమయ్యిందన్నారు. గురువారం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో యు.రంగాపురం గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొన్నారు. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామని, వారి నుంచి మద్దతు లభిస్తోందని పేర్కొన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అనేక మంది పార్టీలోకి రావడానికి మొగ్గు చూపుతున్నారన్నారు. ఖాసీంసాబ్, ఇమామ్‌సాబ్, ఆరిఫ్, సయ్యద్ హుసేన్, దస్తగిరి, నూరుల్లా, కరీం, చాంద్, నరసింహమూర్తి, మెళవాయి నాగరాజు, మేళవాయి రవివీరితోపాటు పలువురు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ కన్వీనర్ లక్ష్మినారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జి రంగేగౌడ్ పాల్గొన్నారు.

ఇక ఇంటి నుంచే పోస్టల్ సేవలు

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): అడ్వాన్స్ పోస్టల్ టెక్నాలజీ 2.0తో అనేక సేవలను తపాలాశాఖ ద్వారా ఇంటి నుంచే అందజేస్తున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇంట్లో నుంచి సెల్‌ఫోన్‌లో తపాలాసేవలు పొందవచ్చన్నారు. ఈనెల 22నుంచి హిందూపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని 472పోస్టాఫీసుల్లో అమలవుతుందన్నారు. ఈ సేవలను ప్రారంభించేందుకు వీలుగా ఈనెల 21న తపాలా కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు జరగవన్నారు.

నరసాంబుదిలో కార్డెన్ సెర్చ్

అగళి, జూలై 17(ఆంధ్రజ్యోతి): నరసాంబుది గ్రామంలో పోలీసులు గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్‌ఐలు వీరేష్, వీరాంజనేయులు, సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేశారు. రికార్డులు లేని మూడు వాహనాలను సీజ్‌చేశారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడరాదని హెచ్చరించారు.

సమస్యల సంత

ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా


సంతలో పశువులు

పెనుకొండ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీకి ప్రతియేటా లక్షలాది రూపాయలు ఆదాయం వస్తున్నా వారపుసంతలో కనీస సౌకర్యాలు లేక ఇటు కొనుగోలుదారులు అటు దుకాణదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారపుసంతకు మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల రైతులు దూర ప్రాంతాల నుంచి అనేక మంది వస్తుంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు జరిగే ఈ సంతలో కనీస సౌకర్యాలు కూడా లేవు. సంతకు వచ్చే వ్యాపారులకు మూత్రశాలలులేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా తాగడానికి మంచినీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నట్లు వ్యాపారులు అంటున్నారు. డబ్బులు పెట్టి నీరు కొనుగోలుచేసి దాహం తీర్చుకోవాల్సి వస్తోందని వివరిస్తున్నారు. వారపుసంతలో నీటి ట్యాంకు ఉన్నప్పటికీ అది నిరుపయోగంగా ఉంది. ఇక దుకాణదారులకు షెడ్లు, ప్లాట్‌ఫాం నిర్మించకపోవడంతో ఎండకు ఎండుతూ వానకు తడవాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులు ప్రవేశించి దుకాణదారులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. అంతేకాకుండా పశువుల దాడిలో దుకాణదారులకు, కొనుగోలుదారులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. కూరగాయలు తినడానికి దుకాణాల్లో జొరపడటంతో కూరగాయలన్నీ ధ్వంసమై తీవ్రంగా నష్టపోతున్నట్లు వ్యాపారులు అంటున్నారు.



పశువుల బెడద అధికంగా ఉంది

: సాబ్జాన్, వ్యాపారి

వారపుసంతలో దుకాణాలు పెట్టుకునేవారి నుంచి కాంట్రాక్టర్లు అధిక మొత్తంలో సుంకాలు వసూలు చేస్తున్నారేతప్ప కనీస సదుపాయాల కల్పించడంలేదు. పశువుల బెడద అధికంగా ఉంది. వీటివల్ల వ్యాపారులు, కొనుగోలు దారులు తీవ్రంగా నష్టపోతున్నారు. పశువుల బెడదను వెంటనే నివారించాలి.



చర్యలు తీసుకుంటాం

: సతీష్‌కుమార్, కమిషనర్

వారపుసంతలోకి పశువులు ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నాం. పశువులు రోడ్లపై, వీధుల్లోకి రానీయకూడదని యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. పశువులను రోడ్లపై, వీధుల్లో వదిలితే సెక్షన్ 1965చట్టం ప్రకారం యజమానులపై కేసులు నమోదుచేసి పశువులను గోశాలకు తరలిస్తాం. త్వరలో సంతలో అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

ఆర్ అండ్ బీ ప్రహరీ ధ్వంసం

16 మందిపై కేసు నమోదు

గోరంట్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న ఆర్‌అండ్‌బీ ప్రహరీగోడను టీడీపీ కార్యకర్తలు ఎక్స్‌కావేటర్‌తో గురువారం ఉదయం కూల్చివేశారు. ప్రభుత్వ ఆస్తిని కూల్చివేసిన సంఘటనలో టీడీపీ నాయకుడు నిమ్మల యువశేఖర్‌తోపాటు, మరో 15 మందిపై గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయ. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా చిత్రావతి నదిపై గోరంట్లలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే నిమ్మలకిష్టప్ప రూ. 5కోట్లు నిధులు తేవడంలో పనులు ప్రారంభించారు. వంతెన ఏర్పాటు కోసం అక్కడున్న ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌ను, అంబేడ్కర్ విగ్రహానికి కూడలిలోని అశ్వర్థంకట్ట, రాగి, వేపచెట్లును తొలగించాలని ఆర్‌అండ్‌బి అధికారులు భావించారు. వైసీపీ అధికారంలోకి రావడంతో గెస్ట్‌హౌస్ భవనాన్ని తొలగించారు. అంబేడ్కర్ విగ్రహం పక్కన ఇద్దరు వ్యాపారులకు సంబంధించిన స్థలం ఉంది. దీంతో వైసీపీ పాలకవర్గం వారు వ్యాపారులను ఆర్‌అండ్‌బీ ప్రహరీగోడను తొలగించడానికి రూ.లక్షల్లో పెద్ద మొత్తం డిమాండ్ చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. డబ్బు ఇవ్వని కారణంగా ప్రహరీగోడను అలాగే ఉంచేసినట్లు తెలుస్తోంది. ప్రహరీకి ప్రధాన రహదారికి మధ్య విశాలమైన ఆర్‌అండ్‌బి స్థలముండడంతో వైసీపీ వారు ప్రయివేటు ట్యాక్సీలను పార్కింగ్ చేసుకోవడానికి అనుమతించారు. ఈనేపథ్యంలో కొంతమంది ప్రముఖుల విగ్రహాలను ఆస్థలంలో పెట్టాలని ఇటీవల భావించారు. రెండురోజులక్రితం సీపీఐ నాయకులు ఆ స్థలంలో పతాకావిష్కరణకోసం దిమ్మెను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలోనే స్థల యజమానుల్లో ఆందోళన మొదలై టీడీపీ నాయకులచేత స్థలానికి అడ్డగా ఉన్న ప్రహరీగోడను అక్కడున్న చెట్లును తొలగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గోడ కూల్చివేతపై మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఫోన్‌ద్వారా మందలించినట్లు తెలుస్తోంది. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించినట్లు తెలుస్తోంది. అయితే తనకు కూల్చివేత సంఘటనకు ఎలాంటి సంబంధం లేదని నిమ్మల యువశేఖర్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు టీడీపీ నాయకుడు నిమ్మల యువశేఖర్‌తోపాటు అనుచరులు వృషభదేవుడు, జయ, మోహన్, నరేష్, కట్టా నారాయణ, జయక్రిష్ణ, ప్రకాషాచారి, విఠలాచారి, మహేష్, మన్సూర్, గంగాధర్, టెంపో ఆదినారాయణ, ప్రోక్లైనర్ డ్రైవర్ రాము, దినేష్, ప్రసాద్‌లపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు.


ధ్వంసమైన ఆర్‌అండ్‌బీ ప్రహరీ

అటవీ ఉత్పత్తులతోనే ఆర్థిక స్వావలంభన

టింబక్టివ్ కలెక్టివ్ నిర్వాహకులు మేరీ వటవట్టం

రొద్దం జూలై 17(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో అటవీ ఉత్పత్తులతో ఆర్థిక స్వావలంభన సాధించవచ్చని టింబక్టివ్ కలెక్టివ్ నిర్వాహకులు మేరీ వటవట్టం, గంగూలీ అన్నారు. గురువారం రొద్దం మండల పరిధిలోని కోగిర కల్పవల్లి అటవీక్షేత్రంలో 17వ మహాసభ నిర్వహించారు. అటవీక్షేత్రాలు అనేక జాతుల మనుగడకు నిలయంగా ఉన్నాయన్నారు. ఎన్నోఏళ్లుగా కల్పవల్లి అటవీక్షేత్రంద్వారా జీవ వైవిధ్యం సాధించామన్నారు. అనంతరం కోలాటం, చక్కభజన, నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చిరంజీవి, మేనేజర్లు శ్రీకాంత్, మహిత, మహేష్, జైశ్రీ, రవి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పరిగి, జూలై 17(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఎంపీడీఓగా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని వివరించారు. సిబ్బంది విధులకు ఆలస్యంగా వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, అరుణ, ఆనంద్, ఆదినారాయణ, సంజప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి'

సోమందేపల్లి, జూలై 17(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని దుర్గాశక్తి సొసైటీ అధ్యక్షురాలు ముంతాజ్ తెలిపారు. గురువారం టింబక్టివ్ కలెక్టివ్ ఉచిత న్యాయసేవ సదస్సును మండలంలోని జూలకుంటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిమహిళ చట్టాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. పెనుకొండ, సోమందేపల్లి మండలాల్లో 9129మంది సభ్యులు సొసైటీలో ఉన్నారన్నారు. ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబనతో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక అధికారి కవిత, ప్రోగ్రాం అసోసియేట్ రవళి, మహాలక్ష్మీ సీఈఓ రమిజ, ఎస్. ముంతాజ్ పాల్గొన్నారు.

సింగిల్ విండో అధ్యక్షురాలిగా చెన్నమ్మ బాధ్యతలు

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సింగిల్‌విండో అధ్యక్షురాలిగా చెన్నమ్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కార్యాలయంలోనే ఆమె పదవీ బాధ్యతలను చేపట్టారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సురేంద్ర, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు.

అభివృద్ధిలో కాంట్రాక్టర్లు కీలకం: కమిషనర్

హిందూపురం, జూలై 17(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధి చెందాలంటే కాంట్రాక్టర్లు కీలకమని కమిషనర్ మల్లికార్జున అన్నారు. గురువారం కమిషనర్ చాంబర్‌లో కాంట్రాక్టర్లతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పనులకు సంబంధించిన బిల్లులను ఒక్కొక్కటే పరిష్కారం చేసేందుకు కృషిచేస్తానన్నారు. అవసరమైతే ప్రతివారం కాంట్రాక్టర్లతో సమావేశం పెట్టుకుని చెల్లించే బిల్లులకు సంబంధించి ఎప్పటికప్పుడు మున్సిపల్ కార్యాలయం నుంచి పంపడం జరుగుతుందన్నారు. కాంట్రాక్టర్లు కూడా సహకరించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటాం

● మున్సిపల్ చైర్మన్, కమిషనర్

హిందూపురం, జూలై17(ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ కార్మికులకు అండగా ఉంటామని మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున అన్నారు. గురువారం ఔట్‌సోర్సింగ్ కార్మికులు చైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ పదవీవిరమణ పొందిన లేదా విధుల్లో ఉండి చనిపోయినవారి స్థానాల్లో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన మేరకు నిబంధనల ప్రకారం 17మంది కార్మికులు విధుల్లోకి తీసుకుంటున్నామన్నారు. సాంకేతిక సమస్యలు అధిగమించి నాలుగు రోజుల్లో నియామక ఉత్తర్వులు అందిస్తామన్నారు. మిగిలినవారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.


అవుట్ సోర్సింగ్ కార్మికులతో మాట్లాడుతున్న చైర్మన్, కమిషనర్

వైభవంగా చాముండేశ్వరీదేవి జయంతి



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

మడకశిర రూరల్, జూలై 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలకంఠాపురంలో చాముండేశ్వరి దేవాలయంలో గురువారం అమ్మవారి జయంత్యుత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు ఆలయంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి: ఎంపీడీఓ

గుడిబండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను నిర్మూలించాలని ఎంపీడీఓ కేశవరెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలు జరగకుండా నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. మండల అభివృద్ధి కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో డీటీ రాంభూపాల్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, ఏపీఓ జగదీష్, సూపర్‌వైజర్ కమలమ్మ, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్; పరిపూర్ణాచారి, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సీం సభకు భారీ ఏర్పాట్లు


సభాస్థలి వద్ద చేసిన ఏర్పాట్లు

పావగడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 21న పావగడకు వస్తున్న నేపథ్యంలో సభకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. మహాత్మాగాంధీ స్టేడియంలో సభ జరగనుంది. జిల్లా కలెక్టర్ శుభకల్యాణి, ఐజీ రఘురాం, ఎస్పీ అశోక్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సభకు తరలిరండి: ఎమ్మెల్యే వెంకటేశ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పావగడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్య పావగడకు విచ్చేస్తున్న సందర్భంగా తాలూకాలోని ప్రతి బూత్ నుంచి వందమందికిపైగా కార్యకర్తలు తరలిరావాలని పావగడ ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్ఎస్‌కె సముదాయ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నోఏళ్లుగా పావగడ ప్రజలు ఎదురుచూస్తున్న భద్ర తాగునీరు అందించేందుకు, సాంఘిక సంక్షేమశాఖ భవనాలు ఉద్ఘాటన చేసేందుకు ఆయన 21న పావగడకు రానున్నారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి వెంకటరమణప్ప, సీనియర్ నాయకులు నరసింహయ్య, సురేష్‌బాబు, రామాంజినప్ప, శంషు, నిస్సార్‌అహ్మద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేటీహళ్లి గ్రామ పంచాయతీ అధ్యక్షుడి ఎంపిక

పావగడ, జూలై 17(ఆంధ్రజ్యోతి): కేటీహళ్లి గ్రామపంచాయతీకి గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో శ్రీనివాసనాయక్ గెలుపొందారు. మొత్తం 16మంది సభ్యులుండగా జేడీఎస్ మద్దతునాయకుడు శ్రీనివాస నాయక్, కాంగ్రెస్ మద్దతుదారు మంజునాథ్ నామినేషన్ దాఖలు చేశారు. 16మందిలో ఒక సభ్యుడు గైర్హాజరుకాగా ఇద్దరు సభ్యులు క్రాస్ ఓటింగ్ చేయడంతో 13ఓట్లలో ఎనిమిది ఓట్లు శ్రీనివాసనాయక్‌కు ఐదు ఓట్లు మంజునాథ్‌కు లభించాయి. శ్రీనివాసనాయక్ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి జానకిరాం తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

టీడీపీ నాయకులు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

రొళ్ల, జూలై 17(ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని రత్నగిరి గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం సమస్యలను అడిగి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, మండల కన్వీనర్లు ఈరన్న, మాజీ ఎంపీపీ క్రిష్టప్ప, రత్నగిరి పంచాయతీ అధ్యక్షుడు వీరా, చిన్నారెడ్డి, ఈశ్వరప్ప, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



రొద్దం (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలిఅడుగులో భాగంగా గురువారం రొద్దంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. మైనార్టీ వీధిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, సిద్దన్న, బేల్దార్ కిష్ట, సురేష్, రామాంజి, రుద్రప్రసాద్, కనుమప్ప పాల్గొన్నారు.



పరిగి, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమంపై సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు.. ప్రజలకు వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి క్లస్టర్ ఇన్‌చార్జిలు రమేష్, రామాంజి, శాసనకోట వెంకటేశ్, డీఎస్ఎల్ శ్రీనివాసులు, నాగేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.



పెనుకొండ రూరల్(ఆంధ్రజ్యోతి): అర్హులకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మండల కన్వీనర్ శ్రీరాములు అన్నారు. పెనుకొండ నగర పంచాయతీ వెంకటరెడ్డిపల్లి 3వ వార్డులో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటి ప్రచారం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గిరి, డీలర్ నరసింహ, బోయనం జుండ, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): మహిళల సాధికారత కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పట్టణ అధ్యక్షులు నాగరాజు అన్నారు. గురువారం పట్టణంలోని 19, 20 వార్డుల్లో సుపరిపాలనలో తొలిఅడుగు నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు చిక్కన్న, కరియన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాపల్లి, కొత్తపల్లిలో టీడీపీ జిల్లా కార్యదర్శి దేవా నరసింహప్ప, ఫిరోజ్‌బాషా ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. నాయకులు ఇంటింటికెళ్లి ప్రజా సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం సమస్యలను అడిగి తెలుసుకున్నారు.



అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవనపల్లిలో గురువారం సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. మండల కన్వీనర్ కృష్ణమూర్తి, నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజ్, సింగిల్‌విండో అధ్యక్షులు గణేష్, డైరెక్టర్లు దాదావీర్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు. వీరు ఇంటింటికీ వెళ్లి ఏడాదిగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు కరపత్రాలు అందించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మారుతిప్రసాద్, పరమేశ్వరప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



పెనుకొండ(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ధ్యేయంగా చంద్రబాబునాయుడు నాయకత్వంలో ప్రభుత్వం పనిచేస్తుందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగోవార్డులో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాసంక్షేమంపై ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి షౌకత్, యూనిట్ ఇన్‌చార్జి కన్న, పాలడుగు చంద్ర, సాయిప్రసాద్, సుధీర్ పాల్గొన్నారు.

'విద్యార్థులు సేవాగుణం అలవర్చుకోవాలి'

పెనుకొండ, జూలై 17(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సేవాగుణం అలవర్చుకుని సమాజసేవలో తమవంతు తోడ్పాటును అందించాలని ఎన్ఎస్ఎస్ పీఓ జయప్ప సూచించారు. గురువారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో శ్రమదానం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలో పిచ్చిమొక్కలు తొలగించి పాదులు తీసి మొక్కలకు నీరుపోశారు.